నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 27-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:103 పేజీలు:68 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

నీటిని గ్రామముల కొసగ
మోటరులను నిర్వహించి ముదమును గూర్చున్
ధాటిగ మనదగు యువతకు
వాటమ్మగు శిక్షణ నిడ ప్రభుత వచించెన్ !!

(లక్షమంది యువజనులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా గ్రామీణ త్రాగునీటి సరఫరా రంగంలో మంచి మార్పులు తేవాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇది భారతీయు లందరికీ గర్వకారణం)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

అందమైన నగరాల్లో
అక్రమంగా నిర్మాణాలు
పాతరేస్తూ చట్టాలను
పాటించని ప్రమాణాలు
అధికార రాజకీయ
అవినీతే కారణం
ప్రభుత్వాలు ఏవైనా
పడకనిద్ర దారుణం

-వేల్పుల నారాయణ
9440433475



సంత్ సేవాలాల్ గొప్ప ఆదర్శమూర్తి



సమాజానికి సన్మార్గాన్ని చూపిన మహనీయుడు లంబాడాలది పోరాటాల చరిత్ర.. నమ్మినవారి కోసం ప్రాణాలిచ్చే గొప్ప మనస్తత్వం

నాగర్ కర్నూల్ నవంబర్ 26: సంత్ సేవాలాల్ గొప్ప ఆదర్శమూర్తిగా జీవించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. తన జీవితమంతా సమాజానికి మంచి మార్గాన్ని చూపేందుకు కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన బోధనలు, ఆశయాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. సంత్ సేవాలాల్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సీఎం ఆకాంక్షించారు.

వేర్వేరు పేర్లతో పిలువబడుతున్న లంబాడా సమాజానికి చెందిన ప్రజలు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. లంబాడాలకు గొప్ప చరిత్ర, ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆ సమాజం ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఆనాడు బ్రిటిషర్లకు వ్యతిరేకంగా కూడా లంబాడాలు ధైర్యంగా పోరాడారని వివరించారు.

లంబాడా జాతి నమ్మకానికి, విశ్వాసానికి మారుపేరని సీఎం ప్రశంసించారు. ఒకరిని నమ్మితే వారి కోసం ప్రాణాలైనా ఇచ్చే గొప్ప మనస్తత్వం ఆ సమాజానికి ఉందన్నారు. సంత్ సేవాలాల్ వంటి మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. లంబాడా సమాజ చరిత్రను, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో ప్రోటోకాల్ పంచాయితీ.. రంగంలోకి దిగిన సందీప్

హైదరాబాద్, నవంబర్ 26:తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పంచాయితీ గాంధీభవన్‌కు చేరింది. ఇద్దరిని గాంధీభవన్‌కు పిలిచి కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి సందీప్ మాట్లాడారు. ఈ వివాదంపై మంత్రి వివేక్ వివరణ ఇచ్చారు. అలాగే, గాంధీభవన్‌కు పెద్దపల్లి ఎంపీ వంశీ కూడా చేరుకున్నారు. ప్రోటోకాల్ పంచాయితీతో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీల మధ్య వర్గపోరు నడుస్తోన్నట్లు సమాచారం. పెద్దపల్లి పార్లమెంట్ పరిధి సమస్యను పరిష్కరించే పనిలో సందీప్ దృష్టి సారించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీల మధ్య సమస్య ఉందని తెలిపారు. తనకు ఎవరితో సమస్య లేదని స్పష్టం చేశారు. తాను స్ట్రాంగ్ అవుతానని, పెద్దపల్లిలో పార్టీని బలపరుస్తానని అన్నారు. తాను పార్టీ మారుతానని చెప్పే వాళ్లకు బుద్ధి ఉండాలని ధ్వజమెత్తారు. తనపై అసూయ పడితే ఇంకా స్ట్రాంగ్ అవుతానని స్పష్టం చేశారు. తాను ఎవరి మీద ఫిర్యాదు చేయలేదని తెలిపారు. లేబర్ మంత్రిగా తెలంగాణలో గిగ్ వర్కర్స్‌కు అడ్వాన్స్ టెక్నాలజీ తీసుకువచ్చానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభ సక్సెస్ చేశానని మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు.

మహిళల హక్కులు, స్వేచ్ఛకు రాజ్యాంగమే రక్షణ: కవిత



హైదరాబాద్, నవంబర్ 26:మహిళల హక్కులు, స్వేచ్ఛకు రాజ్యాంగమే రక్షణ అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. మహిళల సాధికారత కోసమే తాను పార్టీ పెట్టానని పేర్కొన్నారు. పంచాయతీ టు పార్లమెంట్ వరకు మహిళలు జెండా ఎగరవేసే వరకు ఆర్థికంగా, అండగా ఉంటానని భరోసా కల్పించారు. తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగానికి తెలంగాణ రుద్రమ సేనగా నామకరణం చేస్తున్నానని ప్రకటించారు. తెలంగాణ సాయిధ రైతాంగ పోరాటంలో ఎంతోమంది మహిళలు పాల్గొన్నారని తెలిపారు. బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'మహిళలు-రాజ్యాంగ సదస్సు' జరిగింది. ఈ సదస్సులో కవిత పాల్గొని, ప్రసంగించారు. ఇవ్వాళ మనం రాజ్యాంగ అవతరణ దినోత్సవం జరుపుకుం టున్నామని తెలిపారు. నిజానికి మన మహిళలకు దీపావళి, దసరా, క్రిస్మస్, ఈద్ కంటే కూడా ఇవ్వాళే పెద్ద పండుగ రోజని చెప్పుకొచ్చారు. మన రాజ్యాంగం ఆడబిడ్డలకే ఎక్కువ హక్కులు ఇచ్చిందని ప్రస్తావించారు. వేలాది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మన్లు అయ్యారంటే రాజ్యాంగం ప్రసాదించిన హక్కేనని ఉద్ఘాటించారు.

ఏళ్లుగా ఆడవాళ్లను ఒక వస్తువుగానే చూస్తూ ఎంతో అవమానిస్తున్నారని కవిత చెప్పారు. మన రాజ్యాంగమే మనల్ని మనుషులుగా గుర్తించిందని తెలిపారు. 1947లో రాజ్యాంగాన్ని ప్రారంభించి నాలుగేళ్లలో మనకు రాజ్యాంగ అమల్లోకి తెచ్చారని వెల్లడించారు. ఆ రాజ్యాంగమే మనల్ని మనుషులుగా గుర్తించిందని అన్నారు. అది మాత్రమే కాదు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కూడా మన రాజ్యాంగమేనని చెప్పుకొచ్చారు. అందుకే ప్రతి ఇంట్లో వాళ్ల మత గ్రంథంతో పాటు రాజ్యాంగం ఉండాల్సిందేనని తెలిపారు. ప్రతి మహిళ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవాల్సిందేనని స్పష్టం చేశారు. అప్పుడు మాత్రమే వారికి తమ హక్కులు తెలుస్తాయని చెప్పారు. ఆడబిడ్డలంటే ప్రభుత్వానికి ఎందుకంతా వివక్ష.. వాళ్లకు కనీస భద్రత కూడా ఇవ్వరా.. అని ప్రశ్నించారు.తాను ఏదో టైమ్ పాస్ కోసం పార్టీ పెట్టలేదని చెప్పారు. తెలంగాణ మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు రావాలనే పార్టీ పెట్టానని వెల్లడించారు. మగవాళ్లు మనకోసం ఆలోచించటం లేదని.. మనకు పెన్షన్, బంగారం, సైకిళ్లు ఇస్తామని అంటారని.. కానీ ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఆడబిడ్డలకు కావాల్సింది ఇళ్లు, జాగ, బ్యాంక్ ఖాతా, ఉద్యోగాలని తెలిపారు.కోటి మంది ఆడవాళ్లను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారని.. కానీ ఆ పరిస్థితి లేదని చెప్పారు.

కుల, మత, ఆడ, మగ అనే తేడా లేకుండా చెరిపేసింది మన రాజ్యాంగం మాత్రమేనని కవిత అన్నారు. రాజ్యాంగం అమలైన రోజే ఆడబిడ్డలకు స్వాతంత్రం వచ్చిందని తెలిపారు. ఇప్పటికీ భూమి, ఇళ్లు ఉన్న ఆడవాళ్లను వేళ్ల మీద లెక్కించవచ్చని చెప్పారు. సినిమాల్లో గానీ కూలీ పనుల్లో కూడా మగవాళ్లతో సమానంగా మనకు వేతనం ఎందుకు ఇవ్వటం లేదు.. అని ప్రశ్నించారు. ఐటీ ఉద్యోగాల్లో కూడా సమాన పనిచేసే ఆడవాళ్లపై కూడా ఎంతో వివక్ష చూపుతున్నారని అన్నారు. ఏ కులంలో, ఏ మతంలో నైనా ఆడవాళ్లపై కచ్చితంగా వివక్ష ఉందని చెప్పారు. వాళ్ల పిల్లల పేర్లు పెట్టే స్వేచ్ఛగానీ పిల్లల పెళ్లిళ్లకు నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ గానీ లేదని అన్నారు. డబ్బు, కులం తేడానే లేకుండా అందరీ ఆడవాళ్లపై వివక్ష కొనసాగుతూనే ఉందని తెలిపారు. ఒక్క రాజ్యాంగం మాత్రమే మనల్ని గుర్తించిందని.. రాజ్యాంగం సరిగా అమలు చేస్తే చాలు మనకు ఏమీ అవసరం లేదని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీలంటే కాస్త ఆడవాళ్ల హక్కుల కోసం పోరాటం చేస్తారని చెబుతారని అన్నారు. కానీ వాళ్లను కూడా ఆ పార్టీలో ఇబ్బంది పెట్టారని, నక్సల్స్‌గా వెళ్లిన మహిళలు కూడా ఇబ్బంది పడ్డారని తెలిపారు. 'మనం ఆడ సింహాలమని.. మన చరిత్రను మనమే రాసుకుందాం' అని కవిత పిలుపునిచ్చారు.

ప్రతిపక్షాల అడ్డంకులు పనిచేయవంటూ అమిత్ షా వ్యాఖ్యలు!

న్యూ ఢిల్లీ, నవంబర్ 26: మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఖాయమని, ఈ నిర్ణయాన్ని అడ్డుకునే శక్తి ప్రతిపక్షాలకు లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మహిళలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నది బీజేపీ సంకల్పమని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో బీజేపీ నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్యాంగానికి బీజేపీ తీసుకొచ్చిన సవరణలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు.

పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా 106వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చామని అమిత్ షా గుర్తుచేశారు. అయితే ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీకి తాను చెప్పదలుచుకున్నది ఒక్కటేనని.. దేశ మహిళలకు దక్కాల్సిన రిజర్వేషన్లను మీరు ఆపలేరని వ్యాఖ్యానించారు.మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో బీజేపీ స్పష్టమైన వైఖరితో ఉందని, 33 శాతం రిజర్వేషన్లు అమలై తీరుతాయని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు కూడా బీజేపీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అమిత్ షా వెల్లడించారు. రాజ్యాంగ నిర్మాతలు దేశంలో యూసీసీ అమలు కావాలని ఆకాంక్షించారని గుర్తుచేశారు. ప్రజలందరికీ సమాన హక్కులు, సమాన న్యాయం ఉండాలన్నదే రాజ్యాంగ స్ఫూర్తి అని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేసి తీరుతామని ప్రకటించారు. ఈ అంశంపై ప్రతిపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు.రాజ్యాంగానికి బీజేపీ తీసుకొచ్చిన పలు సవరణలను అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పన్నుల విధానాన్ని ఏకీకృతం చేసేందుకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను ప్రవేశపెట్టిన 101వ రాజ్యాంగ సవరణను ప్రస్తావించారు. అలాగే, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన గుర్తింపు కల్పించిన 102వ సవరణ గురించి వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన 103వ రాజ్యాంగ సవరణను కూడా ప్రస్తావించారు. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేని ఆర్థికంగా బలహీన వర్గాలకు ఈ నిర్ణయం ద్వారా అవకాశం కల్పించామని తెలిపారు.

ఇలా వెనుకబడిన తరగతులకు హక్కులు కల్పించడం, రిజర్వేషన్లు అందించడం, దేశంలో పన్నుల విధానాన్ని సరళీకృతం చేయడం వంటి చర్యలను బీజేపీ చేపట్టిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై ఎమర్జెన్సీ అస్త్రం

రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదంటూ అమిత్ షా విమర్శలు గుప్పించారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. అప్పట్లో ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలనలో వ్యక్తుల హక్కులను కాలరాశారని, ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. మరోవైపు బీజేపీ ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు హక్కులు కల్పించడంతో పాటు వివిధ వర్గాలకు రిజర్వేషన్లు అందించిందని చెప్పారు. రాజ్యాంగ దినోత్సవం వేదికగా మహిళా రిజర్వేషన్లు, ఉమ్మడి పౌరస్మృతి అంశాలను ప్రస్తావించిన అమిత్ షా.. రాబోయే రోజుల్లో ఈ రెండు అంశాల అమలుపై బీజేపీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

అహంకారం వద్దు.. కలిసి పనిచేయాలి.. ఎస్పీతో సీట్ల పంచాయితీ వేళ ఖర్గే కీలక వ్యాఖ్యలు..

న్యూ ఢిల్లీ, నవంబర్ 26:ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మధ్య సీట్ల పంపకాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. రెండు పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌ను ఉద్దేశించి పరోక్షంగా చురకలు అంటించారు. నాయకులు అహంకారాన్ని వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

నవంబర్ 26న లక్నోలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సభలో ఖర్గే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నేతలను ఒక్కొక్కరినీ ప్రస్తావిస్తూ ఇమ్రాన్ మసూద్ గురించి మాట్లాడారు. ఇమ్రాన్ మసూద్ టీవీల్లో తరచూ కనిపిస్తారని, ఎంతో ఉత్సాహంగా తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారని ఖర్గే అన్నారు.

అయితే మాటల కంటే పనికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాయకులంతా కలిసి పనిచేస్తేనే పార్టీ మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. పార్లమెంటులో ఇమ్రాన్ మసూద్ పార్టీ తరఫున గట్టిగా తన వాణిని వినిపిస్తున్నారని, కాంగ్రెస్ వైఖరిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు

ఇదే ప్రసంగంలో ఖర్గే కీలక సూచనలు చేశారు . ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండాలని అన్నారు. విజయం సాధించాలంటే అంతర్గత విభేదాలకు తావివ్వకూడదని సూచించారు. నాయకులు అహంకారాన్ని పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాగా, సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకాల చర్చలపై ఇమ్రాన్ మసూద్ కొద్ది రోజులుగా బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీ వైఖరిపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మేము మీ పొత్తు భాగస్వాములమా? లేక మీ సేవకులమా?' అంటూ ఎస్పీ నాయకత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఖర్గే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తిరుమలను దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం: సీఎం చంద్రబాబు

హైదరాబాద్, నవంబర్ 26:తిరుమల లాంటి పవిత్ర క్షేత్రంలో అపూర్వఘట్టం ఇవాళ ఆవిష్కృతమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమలను దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు సమక్షంలో శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాలను చెన్నైకు చెందిన జైన్ దంపతులు ఈరోజు (గురువారం) సమర్పించారు. అనంతరం వర్ధమాన్ జైన్, రాధికా జైన్‌లతో కలిసి తిరుమలలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి మాట్లాడారు. తిరుమలేశునికి భారీ ఎత్తున విరాళం సమర్పించిన జైన్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. వేంకటేశ్వరస్వామి వైభవం మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. తిరుమల అంటే భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మిక ఆనందమని చెప్పుకొచ్చారు.

ప్రతిరోజూ స్వామివారిని 121 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరిస్తారని సీఎం తెలిపారు. ఈ అపూర్వ ఘట్టంలో తాను భాగస్వామిని కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. బంగారు ఆభరణాలతో పాటు విలువైన వజ్రాలు కూడా ఇందులో ఉన్నాయని వివరించారు. మరెక్కడా దొరకనటువంటి దివ్యానూభూతి తిరుమల క్షేత్రంలోనే లభిస్తుందని వెల్లడించారు. రూ.200 కోట్ల విలువైన ఆభరణాలను తిరుమలేశునికి విరాళంగా ఇవ్వడం అపూర్వమైన సంఘటన అని చెప్పుకొచ్చారు. స్వామివారిపై భక్తి, విశ్వాసాలతో జైన్ దంపతులు ఈ బంగారు ఆభరణాలను ఇవ్వడానికి ముందుకు వచ్చారని కొనియాడారు.

దర్వేశిపురాన్ని టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ, నవంబర్ 26:నల్గొండ జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతానని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోనే అత్యుత్తమ సురక్షిత రహదారులను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) నల్గొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. టూరిజం సర్క్యూట్‌గా దర్వేశిపురాన్ని నిలుపుతానని తెలిపారు.

దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం.. గొప్ప ఆధ్యాత్మిక ప్రాంతమని మంత్రి చెప్పుకొచ్చారు. వేల సంఖ్యలో ఈ గుడికి నిత్యం భక్తులు వస్తుంటారని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం 5 ఎకరాల్లో హరిత హోటల్, గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడతామని వివరించారు. మైల సముద్ర ప్రాంతాన్ని టూరిజం సర్క్యూట్‌గా నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

పేదలకు 'ఇందిరమ్మ కుటుంబ బీమా' గొప్ప వరం: కొండా సురేఖ

వరంగల్ జిల్లా, నవంబరు 26 'ఇందిరమ్మ కుటుంబ బీమా' తెలంగాణ పేద ప్రజలకు ఒక వరమని కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యానించారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబం సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈరోజు (గురువారం) వరంగల్ జిల్లా ఉర్సు కరీమాబాద్‌లో కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ జీవిత బీమా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

దరఖాస్తుల స్వీకరణ సెంటర్లను సరైన సిబ్బందితో ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ భరోసాను ప్రతి ఒక్క కుటుంబం వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ఐదు శిబిరాలకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించామని తెలిపారు. వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నమోదు ప్రక్రియను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కొండా సురేఖ ఆదేశించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పంట రక్షణ చర్యలు చేపడుతుండగా ప్రమాదం..

తెగిపడిన విద్యుత్ వైరు తగిలి ప్రాణాలు కోల్పోయిన రైతు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ, విద్యుత్ శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రభ : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలో విద్యుత్ షాక్‌తో రైతు బల్గం ఆశన్న (70) మృతి చెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆశన్న బుధవారం గ్రామంలోని పెద్దమ్మ గుడి ప్రాంతంలో ఉన్న తండ మిది తోటలో వ్యవసాయ పనులు చేసుకుంటూ పంట రక్షణ చర్యలు చేపడుతున్నాడు.

ఈ క్రమంలో అక్కడ తెగిపడిన విద్యుత్ వైరు కాలికి తగలడంతో షాక్‌కు గురై పొలంలోనే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం రాత్రి వరకు ఆశన్న ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆయన ఆచూకీ కోసం గాలించారు. గురువారం ఉదయం పొలంలో వెతకగా ఆశన్న మృతదేహం కనిపించింది. ఆయన కాలికి విద్యుత్ వైరు తగిలి ఉండటాన్ని గుర్తించిన సర్పంచ్ తరి రామానుజం, ఉపసర్పంచ్ బర్మా మల్లయ్య వెంటనే పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీరాములు సతీష్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ ఫ్రాంక్లిన్, లైన్‌మెన్ రాజు కూడా ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రైతు ఆశన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు తగిన ఆర్థిక సహాయం అందించాలని ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మధుశాల కవన మత్తులో ముంచిన కవి హరివంశ్ రాయ్ బచ్చన్

(నవంబర్ 27న "భారతీయ కవి హరివంశ్ రాయ్ బచ్చన్ జన్మదినం" సందర్భంగా)

హిందీ సాహిత్య ప్రపంచంలో ఒక ప్రసిద్ధ వ్యక్తి మరియు అమూల్యమైన భారతీయ కవి అయిన హరివంశ్ రాయ్ బచ్చన్, 20వ శతాబ్దంలో హిందీ భాషా కవిత్వంలో వచ్చిన 'నవీ కవితా సాహిత్య ఉద్యమం' లేదా 'రొమాంటిక్ విజృంభణ'కు చెందిన ఒక ఆదరణ పొందిన కవి. తన హిందీ కవిత్వంలో కలం పేరు అయిన 'బచ్చన్ (బాలుడి వంటివాడు)'గా ప్రసిద్ధి చెందిన ఈ సాహిత్య మేధావి వారసత్వం కేవలం హిందీ సాహిత్య ప్రపంచంలోనే కాకుండా, ఆయన మాటల/కవితల శక్తితో స్ఫూర్తి పొందిన వారి జీవితాలలో కూడా సజీవంగా ఉంది.

వ్యక్తిగత జీవితం మరియు విద్య:

హరివంశ్ రాయ్ శ్రీవాస్తవ 1907 నవంబర్ 27న బ్రిటిష్ ఇండియాలోని అలహాబాద్ (ప్రస్తుత ప్రయాగ్‌రాజ్) నగరంలో ఒక హిందూ శ్రీవాస్తవ కాయస్థ కుటుంబంలో జన్మించారు. కుటుంబ సంప్రదాయంలో భాగంగా, బచ్చన్ 'కాయస్థ పాఠశాల'లో చేరి, అక్కడ ప్రాచీన ఉర్దూ భాషను నేర్చుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంతో ఎంతగానో ప్రభావితులై, ఆయన వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి బి.ఏ మరియు ఎం.ఏ పూర్తి చేశారు. వృత్తిరీత్యా, ఆయన 1941–57 మధ్యకాలంలో అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాషను బోధించడం ప్రారంభించారు. ఆయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఐరిష్ కవి డబ్ల్యూ.బి. యీట్స్‌పై తన పిహెచ్‌డిని పూర్తి చేశారు.

సాహిత్య రచనలు :

ఆయన 'బచ్చన్' అనే కలం పేరుతో హిందీ కవిత్వం రాయడం ప్రారంభించారు. ఆయనకు హిందీ, ఉర్దూ, అవధి వంటి భారతీయ భాషలతో పాటు పర్షియన్ భాషపై కూడా మంచి పట్టు ఉండేది. అయినప్పటికీ, ఆయన ఎక్కువగా హిందీ–ఉర్దూ పదజాలంతో కూడిన ఆకట్టుకునే సాహిత్య రచనలు చేశారు. కుల, మత వ్యవస్థలను వ్యతిరేకిస్తూ, ఆయన తన ఇంటిపేరును శ్రీవాస్తవకు బదులుగా బచ్చన్‌గా నిర్ణయించుకున్నారు. 1935లో తొలిసారిగా విడుదలైన "మధుశాల" కవిత్వం, బచ్చన్ యొక్క అత్యంత ప్రజాదరణ పొందిన కవితా సంకలనాలలో ఒకటి. ఈ కవిత్వంలో వందకు పైగా చతుష్పదాలు (నాలుగు పంక్తుల పద్యాలు) ఉన్నాయి. ఇది సూఫీ ప్రశాంతతతో పాటు తాత్విక భావాన్ని కూడా కలిగి ఉంటుంది. 1936లో వచ్చిన 'మధుబాల', 1937లో వచ్చిన 'మధుకళ' చిత్రాల త్రయంలో భాగంగా, ఈయన పార్షియన్ కవి ఒమర్ ఖయ్యామ్ రచించిన 'రుబాయియాత్'చే ప్రభావితుడయ్యాడు. బచ్చన్ 1955లో షేక్స్‌పియర్ రచించిన 'మక్‌బెత్' 'ఒథెల్లో'లను హిందీలోకి అనువదించారు. ఆయన ఢిల్లీలోని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖలో పనిచేయడం ప్రారంభించారు. ఆయన తన హిందీ సాహిత్య రచనలకు గాను 1976లో 3వ అత్యున్నత భారత పౌర పురస్కారం అయిన పద్మభూషణ్‌ను అందుకున్నారు. ఆయన సాహిత్య అకాడమీ అవార్డు, సరస్వతీ సమ్మాన్, సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డులను కూడా అందుకున్నారు. ఆయన రచించిన ఆత్మకథా సంపుటాల శ్రేణిలో, 'క్యా భులుమ్, క్యా యాద్ కరుమ్' ఆధునిక క్లాసిక్‌గా పరిగణించబడింది. "మిట్టీ కా తన్, మిట్టీ కా మన్, క్షణభర్ జీవన్, – మేరా పరిచయ్ (మట్టి శరీరం, వినోదంతో నిండిన మనస్సు, క్షణిక జీవితం – ఇదే నా పరిచయం)" అనే ఆయన ప్రసిద్ధ కవితా పంక్తులు ఆయన కవితా ప్రతిభను ప్రతిబింబిస్తాయి. ఆయన సాహిత్య రచనలలో చల్ మర్దానే, తేరా హార్, నిషా నిమంత్రన్, ఏకాంత్ సంగీత్, శతరంగిణి, సూత్ కి మాలా, మిలన్ యమిని, ప్రణయ్ పత్రిక, ఏక్ గీత్ వంటి మరెన్నో ఉన్నాయి. ఆయన ఆల్ ఇండియా రేడియో మరియు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేశారు, మరియు 1966 – 72 మధ్యకాలంలో రాజ్యసభ నామినేటెడ్ సభ్యుడిగా సేవలందించారు. ఆయన స్ఫూర్తిదాయక కవితలలో ఒకటైన 'అగ్నిపథ్'ను, ఆయన కుమారుడు అమితాబ్ బచ్చన్ నటించిన బ్లాక్‌బస్టర్ సినిమా కోసం ఉపయోగించారు.

1936లో తన మొదటి భార్య శ్యామ మరణం తర్వాత, బచ్చన్ భారతీయ సామాజిక కార్యకర్త తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి బాలీవుడ్ అగ్రశ్రేణి చిత్రతార అయిన అమితాబ్ బచ్చన్, అజితాబ్ బచ్చన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్వాసకోశ వైఫల్యం కారణంగా ఆయన 2003 జనవరి 18న ముంబైలో తుదిశ్వాస విడిచారు.



-మధుపాళి
9949700037

ఇఫీ-2026లో వైవిధ్యమైన చిత్రీకరణ శైలితో సార్వత్రిక మానవ భావోద్వేగాలను ఆవిష్కరించిన 'ది బ్లాక్ సీ'

న్యూ ఢిల్లీ, నవంబర్ 26: గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం సందర్భంగా అరబిక్ భాషా చలనచిత్రం 'ది బ్లాక్ సీ' సినీబృందం ఈరోజు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) మీడియా సెంటర్‌లో మీడియాతో మాట్లాడింది. డెబ్యూ దర్శకుడు అలాద్దీన్ ముస్తఫా, నిర్మాత హందీ సమీహా, ఫిల్మ్ ఎడిటర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత మోటాజ్ నాషీ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని రూపొందించిన నేపథ్యం, సార్వత్రిక ప్రాముఖ్యత, ఎడిటింగ్ విభాగంలో అనునరించిన ప్రత్యేక శైలి పట్ల అనుభవాలను పంచుకున్నారు.

ఈ 'ది బ్లాక్ సీ' కథను ఎంచుకోవటం వెనకున్న స్ఫూర్తి గురించి దర్శకుడు అలాద్దీన్ ముస్తఫా మాట్లాడారు. ఇఫీ వేదికపై తన చిత్రాన్ని ప్రదర్శించటం, అరబ్ సంస్కృతికి చెందిన కథను అంతర్జాతీయ వేదికపైకి తీసుకురావటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ చిత్రం ప్రధాన ఇతివృత్తాన్ని వివరిస్తూ... ఎలాగైనా లక్ష్యాలను సాధించాలనే తపనతో వ్యక్తులు ప్రయత్నించినప్పుడు, అదుపులేని మానవ కోరికలు హద్దుమీరే విధానాన్ని ఈ చిత్రం విశ్లేషిస్తుందని తెలిపారు. ఆశయాలను నెరవేర్చుకునేందుకు మనుషులు ఎంతటి తీవ్రమైన చర్యలకైనా సిద్ధపడటంపై ఈ సినిమా ప్రశ్నిస్తుందని ఆయన వివరించారు.

చలన చిత్రోత్సవంలో ఒక ఈజిప్షియన్ చిత్రాన్ని భారతీయ, అంతర్జాతీయ ప్రేక్షకుల ముందుకు తీసుకురావటంపై అడిగిన ప్రశ్నకు నిర్మాత హందీ సమీహా స్పందించారు. ఆ కథలోని భిన్న సంస్కృతుల సారూప్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ది బ్లాక్ సీ' అరబిక్ భాషలో నిర్మించిన ఈజిప్షియన్ చిత్రం అయినప్పటికీ ఏ ఒక్క సంస్కృతికో, ప్రాంతానికో పరిమితం కాదని ఆయన పేర్కొన్నారు. "ఇది వివిధ దేశాల ప్రజలందరిలోనూ ఉండే ఉమ్మడి భావాలను ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవులందరికీ ఒకే రకమైన ప్రాథమిక ఆకాంక్షలు ఉంటాయి. ఇదే ఈ చిత్రాన్ని భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరువ చేస్తుంది" అని అన్నారు.

ఇంటి లోపలే బంధీలై డార్క్ సైకలాజికల్ యాప్ ఉచ్చులో చిక్కుకుపోయే పాత్రల చుట్టూ తిరిగే ఈ చిత్రంలోని సాంకేతిక, కథన శైలిపై చిత్ర ఎడిటర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మోటాజ్ నాషీ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఉద్రిక్తతను, నిర్బంధ వాతావరణాన్ని ప్రేక్షకులకు చేరవేసేందుకు రిథమ్, పేసింగ్ ఉపయోగించటం గురించి వివరించారు. చిత్రంలోని లోతైన భావాలను ప్రేక్షకులందరికీ సమర్థవంతంగా చేరవేయటమే ప్రధాన సవాలుగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. వేగవంతమైన కట్స్ కాకుండా పాత్రల్లో ప్రేక్షకులు పూర్తిగా లీనమయ్యేలా, చిత్ర నిర్మాతలు అందించాలనుకున్న ప్రధాన సందేశాన్ని అనుభూతి చెందేలా చిత్ర బృందం ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా సాగే, ఆలోచనతో కూడిన కథన వేగాన్ని ఎంచుకుందని ఆయన తెలిపారు.

తాము రూపొందించిన చిత్రానికి లభించిన సాదర స్వాగతం పట్ల ఉత్సవ నిర్వాహకులకు, భారతీయ ప్రేక్షకులకు సినీ రూపకర్తలు కృతజ్ఞతలు తెలియజేయటంతో విలేకరుల సమావేశం ముగిసింది. ఆకట్టుకునే కథన గమనం, ఆలోచింపజేసే ఇతివృత్తంతో రూపొందిన 'ది బ్లాక్ సీ' చిత్రం, ప్రాంతీయ కథన శైలిని విశ్వవ్యాప్త మానవీయ సత్యాలతో అనుసంధానిస్తూ 57వ ఇఫీ ప్రేక్షకులకు వినూత్న సినిమాటిక్ అనుభూతిని అందిసుంది. ఈ విలేకరుల సమావేశానికి శ్రీమతి సృష్టి సురేష్ కుల్యే నమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈజిప్ట నంస్కృతిలో వేళ్ళూనుకున్నప్పటికీ, అన్ని సమాజాలకు దగ్గరగా ఉండే అంశాలను స్పృశించే 'ది బ్లాక్ సీ' చిత్రం... ఇఫీ 2026 ఇతివృత్తమైన 'విశ్వజనీన కథలు' స్ఫూర్తిని ప్రతిబింబిన్తుంది. మానవ కోరికలను సార్వత్రిక దృక్పథంతో చూడటం, కథనాన్ని నడిపించిన విలక్షణమైన శైలి ద్వారా సినిమా భాషా, సాంస్కృతిక సరిహద్దులను ఎలా అధిగమిస్తుందో ఈ చిత్రం చాటిచెబుతుంది. మనిషి జీవితంలోని ఉమ్మడి అనుభవాల ద్వారా ప్రేక్షకులందరినీ ఏకం చేస్తుంది.

భయాన్ని అధిగమించాలి, సవాళ్లను స్వీకరించాలి, ఆశయాలకు తగినట్టుగా ఆచరణ ఉండాలి: ఇఫీ మాస్టర్‌క్లాస్‌లో ఔత్సాహిక నటులకు సౌరభ్ సచ్‌దేవ సూచన



న్యూ ఢిల్లీ, నవంబర్ 26: గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ)లో భాగంగా కళాఅకాడమీలో 'నటుడిగా మారకుండా మిమ్మల్ని ఆపుతున్నది ఏంటి' అనే అంశంపై మాస్టర్‌క్లాస్ నిర్వహించారు. నటుడు, యాక్టింగ్ కోచ్ అయిన శ్రీ సౌరభ్ సచ్‌దేవ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఔత్సాహిక యువ నటీనటులు పాల్గొన్నారు. నటనారంగంలోకి అడుగుపెట్టాలనుకొనే వారికి అడ్డంకిగా నిలుస్తున్న మానసికమైన, ఆచరణాత్మకమైన, వ్యక్తిగత అవరోధాల గురించి ఈ సెషన్లో వివరించారు.

చర్చలు, ఆచరణాత్మక ఉదాహరణల ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి శ్రీ సచ్‌దేవ అవగాహన కల్పించారు. నటులు కావాలనే కోరికకు అతీతంగా ఆలోచించి తమను వెనక్కి లాగుతున్న భయాలను, అలవాట్లను, వైఖరిని పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

ఆడిషన్లు, తిరస్కరణల చుట్టూ నెలకొన్న అనిశ్చితి గురించి ఆయన వివరించారు. తాము ఎందుకు ఎంపికయ్యామో లేదా తిరస్కరణకు గురయ్యామో నటులకు అన్ని సందర్భాల్లోనూ తెలియకపోవచ్చన్నారు. నటీనటుల ఎంపికలో అనేక మంది భాగం పంచుకుంటారని తెలియజేశారు. వ్యక్తిగత ఆడిషన్లతో భావోద్వేగపరంగా అనుసంధానం కావొద్దని సూచించారు. "మీకు ఎప్పటికీ తెలియదు. మీరు చేయగలిగింది ఒక్కటే. వారికి ఎలా అనిపించిందో అడగడం, అంతే." ఫలితాన్ని అంగీకరించడం, స్పందన కోసం ఎదురుచూడకుండా ఆడిషన్లు కొనసాగించడం గురించి ఆయన వివరించారు.

దేనినైనా ఇష్టపడటానికి, దాని పట్ల నిజమైన అంకితభావం కలిగి ఉండటానికి మధ్య ఉన్న తేడా... ఈ మాస్టర్ క్లాస్ ప్రధానాంశంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తమ నిబద్ధతను ఆత్మపరిశీలన చేసుకోవాలని సచ్‌దేవ అన్నారు. "మీకు నటుడిగా మారాలనే ఇష్టం ఉందా లేదా నటునిగా ఎదగాలనే తపన ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. ఇష్టమనేది ఆసక్తి స్థాయిలోనే ఆగిపోతుందన్నారు. దాని పట్ల శ్రద్ధ చూపాలంటే బాధ్యత, ఏకాగ్రత, నిరంతర శ్రమ అవసరమని తెలియజేశారు. "మనలో చాలామంది మన వనిని ఇష్టపడతాం, కానీ దాని పట్ల నిజమైన శ్రద్ధ వహించం" అని వ్యాఖ్యానించారు. తమ కలలను సాకారం చేసుకోవడానికి అవసరమైన నిబద్ధత తమ వనుల్లో కనిపిస్తోందో లేదో సరిచూసుకోవాలని ఔత్సాహిక నటులకు సూచించారు.

సమాజం నుంచి ఎదురయ్యే విమర్శల పట్ల ఉండే భయం గురించి కూడా ఆయన మాట్లాడారు. ఈ విమర్శలను తట్టుకోవడం కూడా మరో ప్రధాన అడ్డంకిగా ఆయన వర్ణించారు. "సమాజం నుంచి ఎదురయ్యే విమర్శల ముప్పే అనలు సమస్య" అని అభిప్రాయపడ్డారు. నటనలో రాణించాలంటే ఇతరుల విమర్శలను ఎదుర్కొనేందుకు తగినట్టుగా తమను తాము సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

లక్ష్యానికి ఉన్న ప్రాధాన్యం గురించి సచ్‌దేవ వివరించారు. నటనా రంగాన్ని ఎంచుకొనేలా తమకు స్ఫూర్తినిచ్చిన కారణాలను ఓసారి గుర్తు చేసుకోవాలని కోరారు. వ్యక్తిగత అనుభవాలను బట్టి అవి మారుతూ ఉంటాయన్నారు. తన వ్యక్తిగత ప్రయాణం గురించి వంచుకున్నారు. ఆరంభంలో భావవ్యక్తీకరణ విషయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు... తన జీవిత లక్ష్యాన్ని ఎలా తీర్చిదిద్దాయో వివరించారు. ప్రజలకు తమ భావాలను వ్యక్తం చేసే స్వేచ్ఛను ఇవ్వడం, సృజనాత్మక శక్తిని అందించడమే తన లక్ష్యమని తెలియజేశారు. 'ఎందుకు' అనే ప్రశ్నతో ఔత్సాహిక కళాకారులు నిరంతరం అనుసంధానమై ఉండాలని సూచించారు. కేవలం ఆడిషన్లు, ఎంపికలు లేదా బయటి గుర్తింపుతోనే తమ ప్రయాణాన్ని అంచనా వేయకుండా కళ ద్వారా స్వీయ భావవ్యక్తీకరణపై దృష్టి పెట్టాలని ఆయన ప్రోత్సహించారు.నటనలో రాణించడానికి అవసరమైన వాటి గురించి పునఃపరిశీలించుకోవాలని ఈ మాస్టర్ క్లాస్ ప్రోత్సహించింది. భయాలను అధిగమించడం, తిరస్కరణలను అంగీకరించడం, సవాళ్లను స్వీకరించడం, ప్రాథమిక అంశాలను బలోపేతం చేసుకోవడం, ఆశయాన్ని నిరంతర కార్యాచరణగా మార్చడం లాంటివి నటుడిగా మారడానికి మాత్రమే కాకుండా కళారంగంలో అర్థవంతమైన ప్రయాణాన్ని కొనసాగించడానికి కూడా అవసరమని శ్రీ సచ్‌దేవ తెలియజేశారు.

పత్తి పంట మాటున గంజాయి సాగు..

రూ.28.46 లక్షల సరుకు స్వాధీనం

నిర్మల్ పోలీసుల 'గంజాయి గస్తీ'తో పట్టుబడ్డ అక్రమ సాగు

రెండున్నర ఎకరాల్లో 258 గంజాయి మొక్కల గుర్తింపు.. నిందితుడి అరెస్ట్



ఆదిలాబాద్, నవంబర్ 26:పత్తి పంట మాటున గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని నిర్మల్ జిల్లా మామడ పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో వ్యవసాయ పొలంలో తనిఖీలు నిర్వహించి సుమారు రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న 258 గంజాయి మొక్కలను గుర్తించారు. వీటితో పాటు 5.320 కిలోల ఎండిన గంజాయి ఆకులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.28.46 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. నిందితుడిని ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. నిర్మల్ పోలీసులు చేపట్టిన 'గంజాయి గస్తీ'లో భాగంగా ఈ అక్రమ సాగును గుర్తించడం గమనార్హం.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవంబర్ 25న మామడ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మామడ మండలం తండ్ర గ్రామ పరిధిలోని ధన్జీనాయక్ తండా శివారులో తనిఖీలు నిర్వహించారు. అక్కడి వ్యవసాయ పొలంలో కున్సోత్ రవి (43) పత్తి పంటతో పాటు అంతర పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు ధన్జీనాయక్ తండాకు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అధికారుల సమక్షంలో పంచ సాక్షులను ఏర్పాటు చేసి గంజాయి మొక్కలు, ఎండిన ఆకులను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐలు విజయ్, రాకేష్, మహేందర్, ఏఆర్ సిబ్బంది, మామడ పోలీసు సిబ్బంది, సోన్ సర్కిల్ సిబ్బంది, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఈ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గంజాయి సాగుపై సమాచారం ఇవ్వండి

గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ సాగు, విక్రయం, రవాణా, నిల్వ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని నిర్మల్ పోలీసులు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి సాగు లేదా మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బండి లింగమ్మకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఘన నివాళి

ఆదిలాబాద్, నవంబర్ 26: పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత బండి సదానందం యాదవ్‌ల మాతృమూర్తి బండి లింగమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నివాళులర్పించారు. గురువారం ప్రభాకర్ యాదవ్ నివాసానికి చేరుకున్న ఆయన లింగమ్మ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు.అనంతరం లింగమ్మ కుమారులు బండి రాజ్ కుమార్ యాదవ్, తిరుపతి యాదవ్, సదానందం యాదవ్, ప్రభాకర్ యాదవ్‌లను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేశ్‌బాబు, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.



ప్రైవేటు రంగ భాగస్వామ్యం జోరుతో 40-45 బిలియన్ డాలర్ల దిశగా భారత అంతరిక్షరంగ ఆర్థిక వ్యవస్థ: డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూ ఢిల్లీ, నవంబర్ 26:ప్రస్తుతం సుమారు 9 బిలియన్ డాలర్ల విలువ కలిగిన భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ, రాబోయే దశాబ్ద కాలంలోపే 40 నుంచి 45 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని... కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు తెలిపారు. దేశ అంతరిక్ష రంగంలో వస్తున్న ఈ భారీ మార్పునకు ప్రైవేట్ రంగమే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

న్యూఢిల్లీలో జరిగిన ఐదో 'ఇండియా ఇంటర్నేషనల్ స్పేస్ కాన్క్లేవ్-2026' సదస్సులో కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ... కేవలం కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే భారత అంతరిక్ష రంగం పది లోపు అంకుర సంస్థలు కలిగిన స్థాయి నుంచి దాదాపు 400 నుంచి 500 కంపెనీలకు విస్తరించిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో చేపట్టిన సంస్కరణలు దేశంలోని అపారమైన పారిశ్రామికవేత్తల ప్రతిభను, సాంకేతిక సామర్థ్యాలను ఏ విధంగా వెలికితీశాయో ఈ వృద్ధి నిరూపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఇండియన్ స్పేస్ అసోసియేషన్ (ఐఎస్‌పీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా నిర్వహించిన ఈ రెండు రోజుల సదస్సు... 'ఆవిష్కరణలు, పాలన, మానవ సామర్థ్యం, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అంతరిక్ష భవిష్యత్తుకు రూపకల్పన' అనే ఇతివృత్తంతో సాగింది. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న భారత్ పాత్రపై చర్చించేందుకు పరిశ్రమ దిగ్గజాలు, అంతరిక్షరంగ అంకుర సంస్థలు, పరిశోధకులు, అంతర్జాతీయ సంస్థల ప్రతిని ధులు ఈ వేదికగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'స్పేస్ ఎకానమీ 2036: ది ఇండియా బ్లూప్రింట్' నివేదికనూ ఆవిష్కరించారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి డాక్టర్ వి. నారాయణన్, ఇన్-స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ కుమార్ గోయెంకా, ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ కుమార్ భట్ (రిటైర్డ్), అరుణ్ టి. రామచందాని సహా అంతరిక్ష రంగం, సాంకేతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ఏర్పాటు, ఇన్-స్పేస్ రూపకల్పన, అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించడం వంటి నిర్ణయాలు భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలకంగా నిలిచాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇటీవలి దశాబ్దాల్లో తీసుకున్న అత్యంత పరివర్తనాత్మక విధాన నిర్ణయాల్లో ఈ సంస్కరణలూ ఒకటని అభివర్ణిస్తూ... ఇవి సంప్రదాయ యథాతథ స్థితిని మార్చాయనీ, ఇప్పటివరకు ప్రధానంగా ప్రభుత్వ పరిధిలోనే ఉన్న ఈ రంగంలో ప్రైవేట్ సంస్థలూ భాగస్వాములు కావడానికి వీలు కల్పించాయని ఆయన అన్నారు.

భారతీయ అంతరిక్షరంగ అంకురసంస్థల పురోగతిని ప్రస్తావిస్తూ... జూలై 18, 2026న స్కైరూట్ సంస్థ నిర్వహించిన తొలి లాంచ్ వెహికల్ ఫ్లైట్, దాని బహుళ-మిషన్ లాంచ్ అగ్రిమెంట్, ఆ సంస్థ సాధించిన యూనికార్న్ హోదాను కీలక మైలురాళ్లుగా కేంద్ర మంత్రి అభివర్ణించారు. అగ్నికుల్, ఇతర సంస్థలు అభివృద్ధి చేస్తున్న అధునాతన ప్రొపల్షన్ వ్యవస్థలు, ప్రైవేటు సంస్థలు నిర్మించిన రాకెట్ ఇంజన్లు, భూ పరిశీలన సాంకేతికతలు, ఉపగ్రహ చిత్రీకరణ సామర్థ్యాలు దేశంలో పెరుగుతున్న సాంకేతిక బలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇతర పారిశ్రామిక రంగాల కంపెనీల భాగస్వామ్యం మరింత పెరగడమే ఈ సంస్కరణల వల్ల పుట్టుకొస్తున్న వాణిజ్య అవకాశాలకు నిదర్శనమని ఆయన అన్నారు.

అంతరిక్ష సాంకేతికత అందించే ఆర్థిక తోడ్పాటును కేవలం రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల తయారీ, వాణిజ్యపరమైన ఆదాయాల ద్వారా మాత్రమే కాకుండా... క్షేత్రస్థాయిలో వివిధ రంగాల్లో సాధించిన పొదుపు, సామర్థ్యం, మెరుగైన ఫలితాల ఆధారంగానూ అంచనా వేయాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

'పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్' ఉదాహరణను ఉటంకిస్తూ... అంతరిక్ష ఆధారిత అప్లికేషన్లు మౌలిక సదుపాయాల ప్రణాళికలను మెరుగు పరచడానికి, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి, ఖర్చులను తగ్గించడానికి, వృథాల ను-నిధుల లీకేజీలను అరికట్టడానికి ఎంతగానో తోడ్పడతాయని ఆయన తెలిపారు. మౌలిక సదుపాయాలు, నిర్మాణం, కమ్యూనికేషన్, విద్య, ఆరోగ్య సంరక్షణ, రైల్వేలు, రక్షణ రంగం సహా దాదాపు ప్రతి మంత్రిత్వ శాఖలోనూ అంతరిక్ష సాంకేతికత వినియోగం ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా... అంతరిక్ష పరిశ్రమకు మరింత డిమాండ్‌ను ఎలా సృష్టించాలన్న ప్రశ్నకు డాక్టర్ జితేంద్ర సింగ్ ఇలా సమాధానమిచ్చారు. అంతరిక్ష సాంకేతికత ఆచరణాత్మక ఉపయోగాలపై తగినంత అవగాహన లేకపోవడమే డిమాండ్ తక్కువగా ఉందనే భావనకు ప్రధాన కారణమని ఆయన తెలిపారు. దీని సామర్థ్యం కేవలం రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహ మిషన్లకే పరిమితం కాకుండా... మౌలిక సదుపాయాలు, కమ్యూనికేషన్, ప్రజా సేవల పంపిణీలోనూ అపారమైన అవకాశాలను కలిగి ఉందని ఆయన అన్నారు. వివిధ రంగాల్లో అంతరిక్ష సాంకేతికత వినియోగాన్ని విస్తరించడానికి ప్రధాన మంత్రి అనుసరిస్తున్న 'సమగ్ర ప్రభుత్వ విధానం', అంతర్-మంత్రిత్వ శాఖల సమన్వయం కీలక చోదకాలుగా పనిచేసున్నాయని ఆయన పేర్కొన్నారు.

వ్యూహాత్మక సార్వ భౌమాధికారాన్ని, అంతర్జాతీయ సహకారాన్ని సమతుల్యం చేసుకోవడంపై అడిగిన ప్రశ్నకు డాక్టర్ జితేంద్ర సింగ్ బదులిస్తూ... సాంకేతిక సార్వభౌమాధికారం, అంతర్జాతీయ భాగస్వామ్యం పరస్పర విరుద్ధమైనవి కాదని స్పష్టం చేశారు. పరస్పర ప్రయోజనకరమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సిద్ధంగా ఉంటూనే... స్వదేశీ వనరులు, స్వదేశీ సాంకేతికత, స్వదేశీ ప్రాజెక్టులకు పెద్దపీట వేసే మార్గదర్శక విధానంతో భారత్ తన దేశీయ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఎనిమిదేళ్ల కాలపరిమితితో 2023లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన 'నేషనల్ క్వాంటం మిషన్' కింద భారత్ సాధించిన పురోగతినీ కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎనిమిదేళ్లలో 2,000 కిలోమీటర్ల సురక్షిత క్వాంటం కమ్యూనికేషన్ లక్ష్యం నిర్దేశించుకోగా... కేవలం మూడేళ్లలోనే 1,000 కిలోమీటర్ల మైలురాయిని భారత్ అధిగమించిందని ఆయన తెలిపారు. అంతరిక్షం, క్వాంటం సాంకేతికతలు, సెమీకండక్టర్లు, అణు విజ్ఞానం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న రంగాలనీ... ఇవి సాంకేతిక పురోగతికి, వాణిజ్య వృద్ధికి అపారమైన అవకాశాలను కల్పిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో దేశీయ ప్రైవేట్ సంస్థలు తమ పెట్టుబడులను మరింత పెంచాలని డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. వేగంగా ఎదుగుతున్న భారత అంతరిక్ష వ్యవస్థలోకి విదేశీ పెట్టుబడులు మరింతగా వచ్చేలా పరిశ్రమ దిగ్గజాలు చొరవ చూపాలని ఆయన ప్రోత్సహించారు. దేశంలో పరిశోధన, ఆవిష్కరణల బలోపేతం లక్ష్యంగా ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఏఎన్ఆర్ఎఫ్), 'రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్' (ఆర్‌డీఐ) నిధి వంటి సహాయక వ్యవస్థలనూ ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు.

పరిశ్రమల యాజమాన్యాలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను పరిశోధన, శాస్త్రీయ అభివృద్ధికి మరింతగా వెచ్చించాలని కేంద్ర మంత్రి కోరారు. సీఎస్ఆర్ నిధులు కేవలం యంత్రాలు, మౌలిక సదుపాయాల ఖర్చులకే పరిమితం కాకుండా విస్తృత ప్రజానీకానికీ ప్రయోజనం చేకూర్చాలని ఆయన అన్నారు. దేశంలో 'శాస్త్రీయ దాతృత్వ' సంస్కృతిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిస్తూ... పరిశోధనలపై పెట్టే పెట్టుబడిని సమాజానికి, మానవాళికి చేసే ఒక అర్థవంతమైన సేవగా భావించాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సదస్సులో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష ఆవిష్కరణల కూటమి, అంకురసంస్థల కోసం గ్లోబల్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ గ్రాండ్ ఛాలెంజ్‌ల ఏర్పాటుపై వచ్చిన సూచనలపైనా ఆయన స్పందించారు. అంతర్జాతీయ స్థాయిలో తన పాత్రను బలోపేతం చేసుకోవడానికి భారత్... ప్రపంచస్థాయి వ్యూహాలను, ప్రమాణాలను అందిపు చ్చుకోవాలన్నారు. విస్తృతమైన అంతర్జాతీయ అంతరిక్ష సహకారాన్ని సంస్థాగతీకరించే అవకాశాలనూ పరిశీలించవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అంతరిక్ష వ్యవస్థను మరిన్ని రాష్ట్రాలకు విస్తరించడం... విద్యార్థులు, యువ ఆవిష్కర్తల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంపై పరిశ్రమ ప్రతినిధులు చేసిన సూచనలను డాక్టర్ జితేంద్ర సింగ్ స్వాగతించారు. ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత సులభతరం చేయడానికి నిర్మాణాత్మక సలహాలను స్వీకరించడానికి, అవసరమైన విధానపరమైన మెరుగుదలలు చేయడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

విధానపరమైన సంస్కరణలు, స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలు, ప్రైవేట్ రంగానికి చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కృషితో భారత అంతరిక్ష రంగంలో వస్తున్న ఈ పరివర్తన... ప్రపంచ స్థాయిలో పోటీపడే అంతరిక్ష ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదగడానికి బలమైన పునాది వేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

కాలభైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రతిష్ఠా మహోత్సవంలో ప్రత్యేక పూజలు బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఘన స్వాగతం.. వడ్లూరు వరకు భారీ వాహన ర్యాలీ

కరీంనగర్, నవంబర్ 26: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామంలో నిర్వహించిన శ్రీ కాలభైరవ స్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు గురువారం పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే హరీశ్ రావు వడ్లూరు గ్రామానికి వస్తున్న నేపథ్యంలో బెజ్జంకి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి, నినాదాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం బెజ్జంకి క్రాసింగ్ నుంచి వడ్లూరు గ్రామం వరకు భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. దారిపొడవునా అభిమానులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ రమేష్, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతిని ధులు, పార్టీ శ్రేణులు, అభిమాను లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు ఘన నివాళి

అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాల వేసిన హరీశ్ రావు వడ్లూరులో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు.. పూలవర్షం మధ్య నివాళులర్పించిన మాజీ మంత్రి



కరీంనగర్, నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామంలో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి భారీ గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో భారీ గజమాలను విగ్రహానికి అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కల్పించిందన్నారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాలు, ఆయన అందించిన రాజ్యాంగ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సర్పంచ్ రమేష్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గుప్త, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

అంబేద్కర్ ఆశయాలతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కరీంనగర్, నవంబర్ 26: దేశంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, సముచిత న్యాయం కల్పించిన ఘనత భారత రాజ్యాంగానిదేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే తనలాంటి సామాన్యుడు మంత్రి స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు.

77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వారణాసిలో ఆసక్తిదారు వర్గాలతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించిన 'అపెడా'

న్యూ ఢిల్లీ, నవంబర్ 26: కేంద్ర వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పాదనల ఎగుమతి ప్రాధికార సంస్థ (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్‌డ్ ఫూడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ.. ఏపీఈడీఏ.. 'అపెడా') 'ఆసక్తిదారు వర్గాలతో చర్చాకార్యక్రమా'న్ని 2026 నవంబర్ 20న వారణాసిలో నిర్వహించింది.

ఎగుమతిదారులతో పాటు ప్రభుత్వ ఏజెన్సీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యావసాయిక, శుద్ధి చేసిన ఆహార ఉత్పాదనల ఎగుమతులతో ముడిపడిన కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎగుమతులకు మార్గాన్ని సుగమం చేయడం, ప్యాకేజింగ్, ఆధునిక రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్), మార్కెట్టు లభ్యత, నియంత్రణ సంబంధిత అవసరాలు, సంస్థాగత సహాయం వంటి విషయాలు చర్చకు వచ్చాయి. సమావేశంలో పాల్గొన్న వారు ప్రస్తావించిన అంశాలకు 'అపెడా' అధికారులు జవాబులిచ్చారు. ఎగుమతి సంబంధిత సమస్యలను వారు పరిష్కరి ంచారు. ప్రాంతీయ ఎగుమతి దారు సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఎక్కువ భాగస్వామ్యాన్ని చేజిక్కించుకొనేటట్లు చూడటానికి సాధ్యమైన సహాయక చర్యలన్ననిటిని తీసుకుంటామంటూ అధికారులు హామీని ఇచ్చారు.

కార్యక్రమాన్ని 'అపెడా' చైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఘనీభూత పచ్చి బఠానీలు, వివిధ రకాల కాయగూరలతో కూడిన సరకును ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ నుంచి కతర్‌కు ఎగుమతి చేసే ప్రక్రియను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించిన ఘట్టం ఈ కార్యక్రమంలో ముఖ్య ఆకర్షణగా నిలిచింది. శ్రీ లక్ష్మీ ఫ్రోజెన్ ఫూడ్స్ ఎగుమతి చేసిన ఈ సరకులో, 63 మెట్రిక్ టన్నుల ఘనీభూత పచ్చి బఠానీలతో పాటు వివిధ రకాల కాయగూరలు కూడా ఉన్నాయి. ఈ సరకును ఫరూఖాబాద్ నుంచి పంపించారు. నావసేవ ఓడరేవు మార్గం గుండా ఈ కన్‌సైన్‌మెంటును కతర్‌లోని దోహాకు తరలించారు.

తొలిసారి విదేశాలకు ఎగుమతి చేయడానికి ఉద్దేశించిన సరకును ఉత్తరప్రదేశ్ లోని వ్యవసాయ ఎగుమతుల రంగంలో, మరీ ముఖ్యంగా విలువను జోడించి, గడ్డ కట్టించిన ఆహార పదార్థాల రంగంలో.. మరింత వైవిధ్యాన్ని తీసుకువచ్చే దిశగా ఓ కీలక ముందంజను ఈ పరిణామం సూచించింది. ఫరూఖాబాద్, పరిసర ప్రాంతాలలో ఆకుకూరల ఉత్పాదనకు, ఆహార శుద్ధికి అనేక అవకాశాలున్నాయి. ఈ ఎగుమతి ఘట్టం ప్రాంతీయ వ్యవసాయ, ఆహార శుద్ధి కేంద్రాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలను సంధానించే సామర్థ్యాన్ని చాటిచెప్పింది. దీంతో రైతులు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీఓస్), ఆహార శుద్ధి సంస్థలు, ఎగుమతిదారు సంస్థలకు కొత్త అవకాశాలు అందిరానున్నాయి.

కార్యక్రమంలో 'అపెడా' చైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్ ప్రసంగిస్తూ వ్యావసాయిక ఎగుమతులు, శుద్ధిపరిచిన ఆహార వస్తువుల ఎగుమతిని ప్రోత్సహించడానికి సభ్యత్వం పొందిన ఎగుమతిదారు సంస్థలకు అవసరమైన సహాయాన్ని అందించే విషయంలో 'అపెడా' నిబద్ధతతో పని చేస్తుందని పునరుద్ఘాటించారు. వ్యావసాయిక ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు ఎగుమతులకు సంబంధించిన మౌలిక సదుపాయాలను, కార్యకలాపాలను బలోపేతం చేసే ఉద్దేశంతో భారత్ కృషి నిర్యాత్ యోజన (బీకేఎన్‌వై)ని ఇటీవల ప్రారంభించినట్లు ఆయన వివరించారు. 'భారతి' పేరిట మరో కార్యక్రమాన్ని కూడా తమ సంస్థ చేపట్టిందని, ఎఫ్‌పీఓలకు సాధికారతను కల్పించడం, అవి అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకొనేటట్లు చూడటం ఈ పథకం ఉద్దేశమని ఆయన అన్నారు.

ప్రపంచ మార్కెట్లలో భారతీయ వ్యావసాయిక ఉత్పాదనల పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఎగుమతిదారు సంస్థలు, ఎఫ్‌పీఓలు, ప్రభుత్వ విభాగాలు, తదితర ఆసక్తిదారు వర్గాలు సమన్వయంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని 'అపెడా' చైర్మన్ స్పష్టం చేశారు. ఎగుమతిదారు సంస్థలకు ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, సంస్థాగత సహాయాన్ని పటిష్టపరచడానికి, ఎగుమతికి మార్గాన్ని సుగమం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడానికి ఒక అవకాశాన్ని ఈ కార్యక్రమం అందించింది.

కార్యక్రమంలో పాల్గొన్న వారిలో 'అపెడా', ఉత్తరప్రదేశ్ వ్యవసాయ విభాగం, ఈసీజీసీ, డీపీపీక్యూఎన్, ఏఐసీఎల్ఏఎన్ఎస్, తదితర సంబంధిత సంస్థలకు చెందిన సీనియర్ అధికారులతో పాటు ఎగుమతిదారు సంస్థలు, ఎఫ్‌పీఓలు, వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాల ప్రతినిధులు కూడా ఉన్నారు.

ఆసక్తిదారు వర్గాలతో చర్చలు, మార్కెట్టు అభివృద్ధికి అమలుచేయాల్సిన కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన పరంగా అందజేయవలసిన సహాయం, సామర్థ్యాల పెంపు ద్వారా 'అపెడా' భారత వ్యావసాయిక ఉత్పాదనలు, శుద్ధి చేసిన ఆహార పదార్థాల ఎగుమతులను విస్తరించడానికి నిరంతర ప్రాతిపదికన సహకారాన్ని అందిస్తోంది. ఘనీభూత పచ్చి బఠానీలు, అనేక రకాల కాయగూరలతో కూడిన తొలి ఎగుమతి సరకును ఫరూఖాబాద్ నుంచి కతర్‌కు పంపడంతో ఉత్తరప్రదేశ్ వ్యావసాయిక ఎగుమతుల్లో వివిధీకరణను, భౌగోళిక లభ్యతను ప్రోత్సహించే దిశగా ఓ ముఖ్యమైన అడుగు వేశారని స్పష్టమవుతోంది.

మహాకవి గురజాడ అప్పారావు
111 వ సంస్మరణ సభ
29 నవంబరు 2026 ● సాయంత్రం 5:30 - 8:45 PM
5:00 - 5:30 PM ఆహ్వానం - తేనీరు, అల్పాహారం
డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణా సారస్వత పరిషత్, తిలక్ రోడ్డు, హైదరాబాద్
కార్యక్రమం
సభాధ్యక్షులు: డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ
బాన్సర్ జెషన్ రూపకల్పన శ్యాస్త్రవేత్త (అమెరికా)
ముఖ్య అతిథి, గ్రంథ ఆవిష్కర్త: డా. దీర్ఘాసి విజయ భాస్కర్
పూర్వ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ
ప్రత్యేక ఉపన్యాసకులు: ఆచార్య టి. గౌరీశంకర్
పూర్వ రెజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
అంశం: గురజాడ ఆలోచనలు, సామిత్యం: నేటి ప్రాసంగికత
గౌరవ అతిథి: శ్రీమతి అరుణ గురజాడ
వ్యవస్థాపక అధ్యక్షులు, గురజాడ ఫౌండేషన్ (అమెరికా)
ఆత్మీయ అతిథులు, పుస్తక పరిచయం:
శ్రీ మౌనశ్రీ మల్లిక్,
ప్రముఖ తెలుగు సినీ గేయ రచయిత, కవి.
డాక్టర్ బూర్ల చంద్రశేఖర్,
అధ్యక్షులు, తెలుగు విభాగం, ఎస్.ఆర్.ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్
పుస్తకావిష్కరణ: డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ (అమెరికా) రచనలు
మనస్సినీయం - కవితాసంకలనం
విజ్ఞానం, వివేకం - వ్యాసాలు, వ్యాసికలు (వ్యాస సంకలనం)
నృత్య నీరాజనం
వేదాల బానకి బృందం, హైదరాబాద్ వారి నృత్య రూపక ప్రదర్శన
'దేశమును ప్రేమించుమన్నా' 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'
నిర్వహణ: నాట్యాచార్య డా. కోడూరు (వేదాంతం) సుమన, గురు వేదాల బానకి
బహుమతులు, ప్రశంసా పత్ర ప్రదానోత్సవం: ముఖ్య అతిథి చేతుల మీదుగా
వందన సమర్పణ
శ్రీ గురజాడ ప్రసాదరావు

రాజ్యాంగ స్ఫూర్తి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

కరీంనగర్, నవంబర్ 26: రాజ్యాంగం ఆశయాలు, స్ఫూర్తిని ఆచరణలో పెట్టే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీల కురాలు బాలమయి దేవితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు.

రాజ్యాంగ రచన కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ అంబేద్కర్ నేతృత్వంలో రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు కృషి చేసిందన్నారు.

1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించగా, 2015 నుంచి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు,

కలెక్టరేట్ ఏవో ప్రకాశ్, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి అల్పాహారం ఎంతో కీలకం ప్రభుత్వ విప్ విజయరమణ రావు

కరీంనగర్, నవంబర్ 26: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వారి ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు.

ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరే రామ హరే కృష్ణ ట్రస్టు భాగస్వామ్యంతో విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రభుత్వ విప్ విజయరమణ రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువులో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

ప్రజలను ఒక చోటుకు చేర్చి సినిమా పండుగను జరుపుకొందాం



న్యూ ఢిల్లీ, నవంబర్ 26: గోవాలో నిర్వహిస్తున్న భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ..'ఇఫి') 2026లో ఈ రోజు ఇండియన్ పనోరమా విభాగంలో ఆధ్యాత్మికత ప్రధానమైన గుజరాతీ చలనచిత్రం 'లాలో-కృష్ణ సదా సహాయతే'ను ప్రదర్శించారు. ఈ చిత్రానికి శ్రీ అంకిత్ భూపత్భాయి సఖియా దర్శకత్వం వహించారు. సంఘర్షణకు లోనైన ఓ రిక్షా కార్మికుడి కథను ఈ చిత్రం చెబుతుంది. అతడి గతం దు:ఖభరితం. పేదరికంలో మగ్గుతూ, అతడు తన జీవనాన్ని గడుపుతూ ఉంటాడు. ఒకసారి ఓ మారుమూల ఫాంహౌసులో చిక్కుకుపోతాడు. అతడు చేసిన అపరాధం అక్కడ కూడా అతడిని వెంబడించినతాయిన్తూ ఉంటుంది. ఉన్నట్లుండి భగవాన్ కృష్ణుని దర్శనం లభించడంతో, మోక్షాన్ని ప్రాప్తింప చేసుకోవాలని అతడు యత్నిస్తాడు. చిత్ర దర్శకుడు శ్రీ సఖియా ఈ రోజు ఇఫిలో పత్రికా ప్రతినిధుల సమావేశంలో ప్రసంగిస్తూ చలనచిత్ర నిర్మాణం గురించి, అందులో ప్రస్తావించిన ఆధ్యాత్మిక విషయాలను గురించి, టికెట్ల కిటికీ వద్ద ఊహించని విజయం దక్కడం గురించి తెలియజేశారు.

ప్రధానంగా ఈ చలన చిత్రం విశ్వానం, దృఢత్వాలకున్న ప్రాధాన్యాన్ని బోధిస్తుంది. ముఖ్య పాత్రధారికి భగవాన్ కృష్ణుడు మౌన సహచరునిగా ఉంటూ, మార్గదర్శనం చేస్తాడు. దీంతో ముఖ్య పాత్రధారి ఆత్మ మథనం మొదలవుతుంది. తనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఘటనల నుంచి ఊరటను పొందే మార్గం అతడికి కనపడుతుంది. ప్రేమ, నమ్మకం, ఆంతరంగిక పరివర్తన వంటి సార్వత్రిక విషయాల ద్వారా ప్రేక్షకులకు భావాత్మక అనుబంధాన్ని ఏర్పరచాలని తాను కోరుకున్నానని దర్శకుడు వెల్లడించారు.

సినిమాకు పెట్టిన పేరులో 'లాలో'ను గురించి శ్రీ సఖియా ప్రస్తావించి, అది భగవాన్ కృష్ణుని ముద్దుపేరని, బాల్యంలో మగ పిల్లలను తరచు ఆ పేరుతో పిలుస్తుంటారన్నారు. శ్రీ సఖియా తీసిన మొదటి కథాచిత్రం ఇది. పరిమిత బడ్జెట్టులో దీనిని రూపొందించారు. దీని నటవర్గంలో భాగమైన స్నేమితులు కూడా చిత్ర నిర్మాణ బడ్జెట్టులో తమ వంతు సాయాన్ని అందించారు.

ఈ చిత్రం క్రమ క్రమంగా ప్రజల నోళ్లలో నాని చక్కని ఆదరణను సంపాదిం చుకోగలిగిందని, ఇంతవరకు దాదాపు రూ.130 కోట్ల వసూళ్లను రాబట్టిందని శ్రీ సఖియా గుర్తుచేసుకున్నారు. ప్రేక్షకవర్గాల ప్రతిస్పందనలను ప్రచారం చేసి ఈ సినిమాను ఎక్కువ మంది చెంతకు చేర్చిన ఖ్యాతి సామాజిక మాధ్యమానికే చెందుతుందని ఆయన అన్నారు. ఈ చిత్రాన్ని తన స్వగ్రామంలో ప్రదర్శించినప్పటి విశిష్ట అనుభూ తిని ఆయన నెమరు వేసుకుంటూ, తన పల్లెవాసులు వారి ఆప్యాయ తతో పాటు ఆశీర్వాదాలను తనకు అందించారన్నారు.

శ్రీ సఖియా తన సృజనాత్మక శైలిని గురించి చెబుతూ, గర్బా ప్రభావం సినిమా సంగీతంపై ఉందని, భావనలను వ్యక్తం చేయనిచ్చేందుకు వీలుగా క్లోజ్-అప్ షాట్ల పద్ధతిని ఎంపిక చేసుకున్నానన్నారు. సంగీత దర్శకత్వం వహించిన వ్యక్తి ఆస్ట్రేలియాలో ఉంటారని, అక్కడి నుంచే తన తోడ్పాటును అందించారని తెలిపారు. సినిమాలో దృశ్యాపరంగా భవ్యతకు పెద్ద పీట వేయడానికి బదులుగా స్వాభావిక నటన, సంభాషణలు, భావోద్వేగాల తీవ్రతను కళ్లకు కట్టడానికి యత్నించామన్నారు. చిత్రం సీదాసాదాగా ఉంటూ, కథనం చాలావరకు ఎగుడు దిగుడులు, ముందు వెనుకలు లేని పద్ధతిలో సరళరేఖ మాదిరి సాగుతుందని, అయినప్పటికీ ప్రేక్షకులోకం మమేకం అయ్యేటట్లు కథనం ఉండాలని తాను అనుకున్నానని శ్రీ సఖియా వివరించారు. కథ కూడా స్వాభావిక పద్ధతిలో ఆవిష్కారమైందని తెలిపారు.

గుజరాతీ సినిమా భవిష్యత్తును గురించి శ్రీ సఖియా మాట్లాడుతూ, అనేక కథలు రాష్ట్ర సుసంపన్న సాంస్కృతిక వారసత్వంలో ఇమిడిపోయి ఉన్నాయని, వాటిని ఇంతవరకు తెర మీదకు తీసుకురాలేదన్నారు. ప్రాంతీయ సినిమా ఉనికి విస్తరిస్తూ ఉండడం ఆశాజనకమని, వాణిజ్య సాఫల్యంతో పాటు అర్థవంతమైన కథన కళకు ప్రాధాన్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని శ్రీ సఖియా స్పష్టం చేశారు.

55వ ప్రగతి సమావేశానికి అధ్యక్షత వహించిన పీఎం

న్యూ ఢిల్లీ, నవంబర్ 26:క్రియాశీలక పాలన, సకాలంలో అమలును ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐసీటీ ఆధారిత, బహుళ-విధాన వేదిక అయిన ప్రగతి 55వ సమావేశానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు సేవా తీర్థలో అధ్యక్షత వహించారు. అమలులో ఎదుర వుతున్న సమస్యలను పరిష్కరించడానికి, ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల పంపిణీని మెరుగుపరచడానికి ఈ వేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏకతాటిపైకి తెస్తుంది.

ఈ సమావేశంలో, ప్రధాన మంత్రి రోడ్డు, విద్యుత్తు, బొగ్గు, రైల్వే రంగాల్లో రూ.78,000 కోట్లకు పైగా వ్యయంతో కూడిన అయిదు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమీక్షించారు. ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన పరివర్తన (పీఎం-సేతు) అమలుతో సహా పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐ) వ్యవస్థను కూడా సమీక్షించారు.

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం కారణంగా వ్యయం పెరగడం మాత్రమే కాకుండా... పౌరులు, వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థలకు అందాల్సిన ప్రయోజనాలు కూడా ఆలస్యమవుతాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పెండింగులో ఉన్న సమస్యలను పూర్తి బాధ్యతతో, వాస్తవ కాలపరిమితులతో సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. సకాలంలో పనులు పూర్తి చేయడంతో పాటు, నిర్మాణ నాణ్యతలో ఉన్నత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రాజెక్టును ప్రధాన మంత్రి సమీక్షించారు. దీనిని వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. వ్యయం కంటే ఫలితాలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని పీఎం పునరుద్ఘాటించారు. బొగ్గు ప్రాజెక్టును కూడా ఆయన సమీక్షించారు. ప్రాజెక్టును నిర్ణీత సమయంలోగా అమలు చేయడంతో పాటు పునరావాసాన్ని, తిరిగి నిలదొక్కుకొనేలా సహకారాన్ని సకాలంలో, గౌరవప్రదంగా అందించాలని ప్రధాని సూచించారు.

వికేంద్రీకృత సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల కోసం వినూత్న విధానాలను అన్వేషించాలని విద్యుత్తు ప్రాజెక్టును సమీక్షిస్తున్న సందర్భంలో ప్రధానమంత్రి సూచించారు. స్థానికంగా లభించే వనరులు, గిరాకీని పరిగణించి వినియోగ కేంద్రాలకు సాధ్యమైనంత సమీపంలో ఇలాంటి ప్రాజెక్టుల ను అభివృద్ధి చేయాలని సూచించారు. విశ్వసనీయమైన, తక్కువ ధరలకే లభించే విద్యుత్తును అందించడం, పంపిణీ మౌలిక వసతులపై ఒత్తిడిని తగ్గించడమే ఈ ప్రయత్నాల లక్ష్యంగా ఉండాలని తెలియజేశారు.

ఐటీఐ వ్యవస్థను, పీఎం?సేతు అమలును పీఎం సమీక్షించారు. ఐటీఐలను బలోపేతం చేయడంలోనూ, పీఎం-సేతు పరిధిలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలోనూ కీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రులకు, ప్రధాన కార్యదర్శులకు పిలుపునిచ్చారు. ఐటీఐలతో పరిశ్రమలు భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవడానికి, వాటి ఉన్నతీకరణకు తోడ్పడటానికి, ప్రస్తుతమున్న, భవిష్యత్తు అవసరాలకు తగినవిధంగా మానవ వనరులను తీర్చిదిద్దడానికి ఇదే సరైన సమయమని తెలియజేశారు. యువతకు మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ భాగస్వామ్యాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాలు, ఐటీఐలు, పరిశ్రమల మధ్య సన్నిహిత సహకారం ఉండాలని ఆయన సూచించారు.

భవిష్యత్తు మానవ వనరుల అవసరాలను ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్యూలు) అంచనా వేసుకోవాలని, సంబంధిత విభాగాల్లో శిక్షణ, నియామకాల కోసం ఐటీఐలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ప్రధాన మంత్రి సూచించారు. ప్రయోగాత్మక శిక్షణ, అప్రెంటిస్షిప్లకు తోడ్పాటు ఇవ్వాలని, శిక్షణ పొందిన ఐటీఐ గ్రాడ్యుయేట్ల నియామకాలపై మరింత దృష్టి సారించాలని పీఎస్యూలకు చెప్పారు. ఈ తరహా భాగస్వామ్యం... విద్యార్థులకు పారిశ్రామిక అనుభవాన్ని అందిస్తుందని, తమ కార్యాచరణ అవసరాలకు తగిన నైపుణ్యం గల మానవ వనరులను పీఎస్యూలకు సులభంగా లభించేలా తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

పారిశ్రామిక క్లస్టర్లు, ఆయా రంగాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఉండాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలోనూ ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు, రాబోయే పెట్టుబడులకు అనుగుణంగా ఐటీఐ విభాగాలు, పాఠ్యప్రణాళికలు, శిక్షణా సామర్థ్యాన్ని రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

స్థానిక అవసరాలకు తగినట్లుగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా సొంత ప్రాంతాల్లోనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రధానమంత్రి అన్నారు. ఐటీఐలు, స్థానిక యాజమాన్యాల మధ్య బలమైన అనుసంధానం ఉంటే ఇంటికి చేరువలోనే ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. దీని వల్ల ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు తగ్గడమే కాకుండా, యువత తమ ప్రాంతాల్లోనే ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి వీలు కలుగుతుందని ప్రధాని వివరించారు.

ప్రధానమంత్రి ఐటీఐ విద్యకు 'క్లాస్రూమ్?కంపెనీ?కెరీర్' (3సీ) విధానాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను పరిశ్రమలో ఆచరణాత్మక అనుభవంతో అనుసంధానించి, తద్వారా ఉపాధికి, వృత్తిపరమైన పురోగతికి అవకాశం లభిస్తుంది. విద్యార్థులకు సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని, వాస్తవ పని పరిస్థితులపై అవగాహనను, శిక్షణ నుంచి ఉపాధికి స్పష్టమైన మార్గాన్ని అందించడానికి ఐటీఐలు, పరిశ్రమలు కలిసి పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నైపుణ్య శిక్షణ ఎంతో కీలకం!

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్
మహిళ ఉపాధి, ఆదాయవనరులకు కార్యక్రమం శ్రీకారం
త్రీటౌన్లో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే మూడు కేంద్రాలు.. మరిన్ని ప్రాంతాలకు శిక్షణ విస్తరణ
మహిళలు నైపుణ్యాన్ని ఉపాధిగా మలుచుకోవాలి.. మరిన్ని శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

ఖమ్మం, నవంబర్ 26:మహిళల ఆర్థికాభివృద్ధికి నైపుణ్య శిక్షణ ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మహిళా సాధికారతకు క్షేత్రస్థాయిలో అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహిళలకు కుట్టుపనిలో శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా చేయాలన్న ఉద్దేశంతో 30, 33, 34, 35వ డివిజన్ల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ ప్రతి మహిళలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దానికి సరైన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ముఖ్యంగా టైలరింగ్ వంటి వృత్తి విద్య ద్వారా ఇంటి వద్దనే ఉంటూ ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా టైలరింగ్ రంగంలో ఆధునిక పద్ధతులు, కొత్త డిజైన్లు, కుట్టుపనిలో మెళకువలను మహిళలు నేర్చుకోవాలని యుగంధర్ సూచించారు. శిక్షణ కేంద్రానికి వచ్చి నేర్చుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, ఇక్కడ పొందిన నైపుణ్యాన్ని భవిష్యత్తులో ఉపాధి అవకాశాలుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తయిన తర్వాత సొంతంగా కుట్టు మిషన్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందే దిశగా మహిళలు ఆలోచించాలన్నారు. తద్వారా వ్యక్తిగత ఆదాయం పెరగడంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని చెప్పారు.

మహిళలు ఆర్థికంగా బలవడినప్పుడే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అందుకే మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలకు తాను అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రారంభించిన కేంద్రంతోనే ఈ ప్రయత్నాన్ని పరిమితం చేయబోమని, నగరంలోని మరిన్ని డివిజన్లకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని విస్తరిస్తామని హామీ ఇచ్చారు. మహిళల నుంచి వచ్చే స్పందనను బట్టి అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే మూడు ప్రాంతాల్లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు డాక్టర్ తుమ్మల యుగంధర్ తెలిపారు. మహిళలకు వృత్తి నైపుణ్యాలు అందించి, ఆర్థికంగా స్వతంత్రులుగా తీర్చిదిద్దడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని వివరించారు. త్రీటౌన్ ప్రాంతంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు ఆసక్తి ఉన్న మహిళలు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల అభ్యున్నతికి అవసరమైన సహకారం, ప్రోత్సాహం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

త్రీటౌన్ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందు చూపుతో ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని యుగంధర్ పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నూతన వ్యవసాయ మోడల్ మార్కెట్ ఏర్పాటు, ఖమ్మం నగరానికి మణిహారంగా నిలిచే తీగల వంతెన నిర్మాణం వంటి కీలక పనులు చేపట్టినట్లు వివరించారు.

వైరాలో టిప్పర్ బీభత్సం..

మహిళ దుర్మరణం

స్కూటీని ఢీకొన్న టిప్పర్.. ఘటనా స్థలంలోనే మృతి

ఖమ్మం, నవంబర్ 26:వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. స్కూటీపై వెళ్తున్న ముళ్లపాటి పని అనే మహిళను టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలు సోమవారం గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. సమాచారం అందుకున్న వైరా ఎస్సై ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 1,141 కోట్ల వ్యయంతో 'తపాలా కార్యకలాపాల పథకం' కొనసాగింపునకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, నవంబర్ 26:2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 ఆర్థిక సంఘం కాలంలో రూ. 1,141 కోట్ల ప్రతిపాదిత వ్యయంతో కేంద్ర ప్రభుత్వ 'తపాలా కార్యకలాపాల పథకం' కొనసాగింపునకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా తపాలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, లాజిస్టిక్స్తో పాటు ఈ-కామర్స్, డిజిటల్ సేవల పంపిణీలో పెరుగుతున్న అవసరాలకు మద్దతు ఇవ్వాలనే ప్రధాన లక్ష్యంతో ఈ పథకం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 1,49,655 తపాలా కార్యాలయాలతో సహా మొత్తం 1.65 లక్షల తపాలా కార్యాలయాలతో ప్రపంచంలోని అతిపెద్ద తపాలా వ్యవస్థలలో ఇండియా పోస్ట్ ఒకటిగా ఉంది. ముఖ్యంగా మారుమూల, సేవలు సరిగా అందని ప్రాంతాల్లో మెయిల్, పార్శిళ్లు, బ్యాంకింగ్, బీమా, ఇతర పౌర-కేంద్రీకృత సేవలను అందించే ఒక ముఖ్యమైన వేదికగా ఇది కొనసాగుతోంది.

తన ప్రధాన తపాలా కార్యకలాపాలతో పాటు పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ (పీఓఎస్బీ), ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ), పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), ఆధార్ నమోదు- నవీకరణ, పోస్ట్ ఆఫీస్ పాస్పోర్ట్ సేవా కేంద్రాల ద్వారా పాస్పోర్ట్ సేవలు, కేవైసీ ధ్రువీకరణ సేవలు, డాక్ఘర్ నిర్యాత్ కేంద్రాల (డీఎన్కేలు) ద్వారా గ్రామీణ కళాకారులకు మద్దతు వంటి కార్యక్రమాల ద్వారా ఇండియా పోస్ట్స్ విస్తృత శ్రేణి ప్రజా సేవలను అందిస్తోంది.

ఈ పథకం దేశవ్యాప్తంగా తపాలా మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు తోడ్పడుతోంది. ఇది చివరి మైలు వరకు డెలివరీని బలోపేతం చేయటంతో పాటు లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తోంది. ఆర్థిక సమ్మిళిత త్వాన్ని ప్రోత్సహించటం, వినియోగదారు-కేంద్రీకృత సేవల పంపిణీని ఇది పెంపొందిస్తుంది. ఈ పథకం.. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ వంటి విస్తృత లక్ష్యాలకు కూడా అనుగుణంగా ఉంది.

చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్



ఖమ్మం, నవంబర్ 26: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్తో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలను తనిఖీ చేశారు. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అస్సాంలోని సిల్చార్ వద్ద డోలూలో రూ.2,014 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, నవంబర్ 26:సిల్చార్ విమానాశ్రయంలో ప్రస్తుతమున్న రక్షణ శాఖ సివిల్ ఎన్క్లేవ్ ఎదుర్కొంటున్న కార్యకలాపాలు, స్థల పరిమితుల సమస్యను అధిగమించేందుకు, నిరంతరం పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వసతులు కల్పించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. అస్సాంలోని సిల్చార్ వద్ద డోలూలో రూ. 2,014 కోట్ల అంచనా వ్యయంతో భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ద్వారా నూతన గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయ అభివృద్ధికి ఆమోదం తెలిపింది.

బరాక్ లోయకు అస్సాంలోని కచార్ జిల్లాలో ఉన్న డోలూ వ్యూహాత్మక కేంద్రంగా ఉంది. విస్తారమైన తేయాకు తోటలు, వ్యవసాయాధారిత పరిశ్రమలతో పాటు పర్యావరణ, సాంస్కృతిక పర్యాటకానికి అపారమైన అవకాశాలున్న ప్రాంతంగా దీనికి పేరుంది.

ప్రతిపాదిత టెర్మినల్ భవనం మొత్తం 12,351 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రద్దీ సమయాల్లో 800 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో నిర్మించనున్నారు. దీన్ని ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, పర్యావరణ అనుకూల సూత్రాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించేందుకు వీలుండే విధానంతో రూపొందించారు. దీనికి అదనంగా ఏ-320 విమానాల రాకపోకలకు వీలుగా 2,705 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో కోడ్-4సీ ప్రమాణాలతో రన్వేను అభివృద్ధి చేస్తారు. ఏ-320 విమానాలను నిలిపే సామర్థ్యం గల కొత్త పార్కింగ్ స్థలం, విమానాలను వేరుగా ఉంచేందుకు ప్రత్యేక ఐసోలేషన్ బే నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.

అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యత గల ప్రాజెక్టుగా డోలూ గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయం దక్షిణ అస్సాంతో పాటు పొరుగు రాష్ట్రాల పరిసర ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న విమాన ప్రయాణ అవసరాలను తీరుస్తుంది. ఇది ప్రస్తుతమున్న విమానాశ్రయాలపై ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుంది. వాణిజ్యం, వర్యాటక రంగాలను ప్రోత్సహించటం ద్వారా ప్రాంతీయ ఆర్థిక సామర్థ్యాన్ని వెలికితీస్తుంది.



పంజాబ్‌లో పొలాలను చూసిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్..

భూసారాన్ని మెరుగుపరచడం, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఉద్దేశం



న్యూ ఢిల్లీ, నవంబర్ 26:పంజాబ్.. తరన్‌తారన్ జిల్లాలో 'బూహ్ హవేలియా' గ్రామంలో ఈ రోజు 'కిసాన్ చౌపాల్' కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మంత్రి ముఖాముఖి చర్చించారు. పొలాల మధ్య రైతులతో కలిసి కూర్చొని వారి సమస్యలను, వారు చేసిన సూచనలను మంత్రి విన్నారు. గడ్డి దుబ్బులను మండించకుండానే ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న ప్రగతిశీల రైతులకు, పంచాయతీలకు మంత్రి అభినందనలు తెలిపారు. ఒక పెద్ద రాజకీయ సభను నిర్వహించడానికి తాను ఇక్కడికి రాలేదని, ఒక సేవకునిగా రైతుల మధ్య కూర్చొని వారు చెప్పే మాటలను ఆలకించడానికి వచ్చానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'ను పంజాబ్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రైతు అనుకూల విధానాలను అనుసరించడానికి, కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)ని చెల్లించి రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాలను సేకరించడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు.

రైతులకు సేవ చేయడమే సద్గురు ఆరాధన

'కిసాన్ చౌపాల్'ను ఉద్దేశించి కేంద్ర మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగిస్తూ, రైతులు వగలూ రాత్రి చెమటోడ్చి దేశ ప్రజల కడుపు నింపుతారని భావోద్వేగంతో చెప్పారు. "నేను ఒక నేతను కాను, రైతులకు సేవ చేసే వాడిని. గురు నానక్ దేవ్ జీ కూడా ఈసునసూయలను, ద్వేషాన్ని తృజించమని, ప్రజలకు సేవ చేయమనే కదా సందేశాన్ని చ్చారు. మంత్రిపదవిని అప్పగించారంటే అహంకరించడానికి కాదు, ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చారు. నా దృష్టిలో, రైతులకు సేవ చేయడమూ సద్గురు భగవాన్‌ను ఆరాధించడమూ ఒకటే" అని శ్రీ చౌహాన్ అన్నారు.

'హరిత క్రాంతి' నుంచి 'ఖేత్ బచావో అభియాన్' వైపునకు పయనం

చరిత్రాత్మక సేవలను అందిస్తున్న పంజాబ్ రైతులకు వందనాలు అని కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ అంటూ దేశం ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొని, విదేశాల నుంచి ఎర్ర గోధుమను దిగుమతి చేసుకోవాల్సిన స్థితి తలెత్తినప్పుడు, హరిత క్రాంతిని తీసుకు వచ్చి దేశ ఆహార ధాన్యాల గాదెలను నింపింది పంజాబ్‌కు చెందిన రైతులేనన్నారు. అయితే ప్రస్తుత రసాయనిక ఎరువులను, పురుగుమందులను మరీ ఎక్కువ మోతాదులో వినియోగిస్తున్న, వంట వ్యర్థాలను మండించివేస్తున్న కారణంగా ధరణీ మాత సుస్థిత క్షీణిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మనం భూసారాన్ని కాపాడుకోలేక పోయామంటే, రాబోయే తరాలు పెద్ద సంకటాన్ని ఎదుర్కోవలసి వస్తుందని మంత్రి హెచ్చరిక చేశారు. బూహ్ హవేలియా, పరిసర ప్రాంతాల రైతులు గత ఆరు సంవత్సరాలుగా వరి మోడులను తగులబెట్టకుండా 'హ్యాపీ సీడర్', 'డైరెక్ట్ సీడింగ్' పద్ధతులను అవలంబిస్తూవస్తున్నారని ఆయన వారిని అభినందించారు. ఈ గ్రామం 'ఖేత్ బచావో అభియాన్'లో ఒక కొత్త దిశను దేశానికి చూపించిందని మంత్రి అన్నారు.

వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సలహా

చర్చలో భాగంగా ప్రగతిశీల రైతులు సర్దార్ సుఖ్‌వీందర్ సింగ్ (కిర్‌తోవాల్), సర్దార్ జతిందర్ సింగ్ (ముండా పిండ్), మాజీ సర్పంచ్ సర్దార్ గుర్‌నామ్ సింగ్ గడ్డి దుబ్బుల నిర్వహణలో ఎదురవుతున్న వ్యావహారిక సమస్యలతో పాటు బేలర్ యంత్రాలకు నబ్బిడీకి సంబంధించిన సూచనలు చేశారు. రైతులు చేసిన సూచనలను మంత్రి సావధానంగా విని, వారిని ఢిల్లీకి పిలిపించి విస్తృతంగా చర్చిస్తామని హామీనిచ్చారు. సబ్సిడీపై అందిస్తున్న యంత్రాల విషయంలో వచ్చిన ఫిర్యాదుల పట్ల కేంద్ర మంత్రి స్పందిస్తూ, ఈ సంవత్సరం కూడా పెద్ద మొత్తాన్ని సుమారు రూ.286 కోట్ల వరకు వంట అవశేషాల నిర్వహణ (క్రాప్ రెసిడ్యూ మేనేజ్‌మెంట్..సీఆర్ఎమ్) కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులను ఇస్తుంటే, యంత్రాలను కొనుగోలు చేయడంతో పాటు నాణ్యతను పరీక్షించవలసిన బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వానివేనని ఆయన అన్నారు. రైతులకు మంచి నాణ్యమైన యంత్రాలు అందేటట్లు చూస్తూ, ఒకవేళ అవి పాడయితే వాటి మరమ్మతుకు తగిన వ్యవస్థను ఏర్పాట్లు చేసే అంశంపైన కూడా రాష్ట్రప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు.

'ఫసల్ బీమా యోజన', వివిధీకరణలకు ప్రాధాన్యం

వ్యవసాయాన్ని లాభదాయక వాణిజ్య కార్యకలాపంగా తీర్చిదిద్దడానికి ఉత్పాదనను పెంచడం, వ్యయాలను తగ్గించుకోవడం, రక రకాల పంటలు సాగు చేయడం, పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం వంటి ఏకీకృత వ్యవసాయ పద్ధతిని అనుసరించడం అత్యవనరమని శ్రీ చౌహాన్ తెలిపారు. పంజాబ్‌లో ఇప్పటి వరకు 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'ను అమలు చేయకపోవడం నిరుత్సాహకరమని ఆయన అన్నారు. వరదల వేళ కూడా తాను ముఖ్యమంత్రికి లేఖ రాసి ఈ పథకాన్ని అమలు చేయవలసిందిగా కోరినట్లు, ఆ పథకాన్ని అమలు చేసినట్లయితే ప్రాకృతిక విపత్తులలో రైతులకు నష్టాన్ని భర్తీ చేయడానికి వీలు ఉంటుందని సూచించినట్లు శ్రీ చౌహాన్ వెల్లడించారు.

పంజాబ్‌లో కూటమితో ప్రగతి, అభివృద్ధిలలో మొదలవనున్న నూతనాధ్యాయం కార్యక్రమం ముగిసిన తరువాత ప్రసార మాధ్యమాల ప్రతినిధులతో కేంద్ర మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు హామీనిస్తూ, వరి, గోధుమ పంటలను కనీస మద్దతు ధర చెల్లించి కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దీనికి అదనంగా, పప్పుధాన్యాలను (కంది, మసూర్, మినప) 100 శాతం కొనుగోలు చేయడానికి, పత్తిని ఎమ్ఎస్‌పీ చెల్లించి సేకరించడానికి మోదీ ప్రభుత్వానిది పూచీ అన్నారు. ఇదివరకటి యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే మోదీ ప్రభుత్వం అనేక రెట్లు ఎక్కువ కొనుగోళ్లు జరిపిందని, ఇది ఇకమీదట కూడా నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజాపాలన

తుంగతుర్తి నియోజకవర్గంలో 5 వేల నూతన పింఛన్లు

మోత్కూర్‌లో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

లనల్గొండ, నవంబర్ 26:కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగిస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని రహదారి బంగ్లా అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్తగా 5 వేల పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి ప్రభుత్వం రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా అమలు చేస్తోందని, ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోత్కూర్‌లో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం ఇప్పటికే లా సెక్రెటరీ పాపిరెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్, రాష్ట్ర సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే మోత్కూర్‌లో కోర్టు ఏర్పాటు జరుగుతుందని స్పష్టం చేశారు. పట్టణంలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయానికి అదనపు నిధుల మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. మోత్కూర్-గుండాల రహదారిపై బిక్కేరు వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు విషయమై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఏర్పాటుకు ఐదు గ్రామాల నుంచి ప్రతిపా దనలు పంపగా.. కంచనపల్లి, మద్దిరాల, నాగారం గ్రామాల్లో మూడు సహకార సంఘాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు.

మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ వైర్మన్ పదవిని రాజకీయ సమీకరణాలు, రొటేషన్ పద్ధతిలో ఈసారి అడ్డగూడూరు మండలానికి కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ స్పష్టం చేశారు. మార్కెట్ వైస్ చైర్మన్ పదవిని ఆత్మకూరు (ఎం) మండలానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోనూ ఇప్పటికే చర్చించినట్లు చెప్పారు. మోత్కూర్ సింగిల్ విండో చైర్మన్ నామినేటెడ్ పదవిని కూడా త్వరలోనే భర్తీ చేస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎమ్మెల్యే సామేల్ హెచ్చరించారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, బద్దం నాగార్జునరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య, మండల, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కూరేళ్ల శ్రీరాములు, బొడ్డుపల్లి కళ్యాణ్, సమరం రెడ్డి, అడ్డగూడూరు, శాలిగౌరారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, చింత ధనుంజయ్, మందుల సురేష్ పాల్గొన్నారు.

అప్పాజీపేట ప్రాచీన శివాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

849 ఏళ్ల నాటి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

నిధుల వదంతులకు తెర..

గ్రామస్తుల సమక్షంలో గర్భగుడుల తొలగింపు



నల్గొండ, నవంబర్ 26:నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం అప్పాజీపేటలోని ప్రాచీన శివాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని పూర్తిగా తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయ స్తంభాలను తొలగించి పక్కకు భద్రపరిచారు. బుధవారం పానపట్టం, సూర్యుని గర్భగుడి స్తంభాలను తొలగించారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గర్భ గుడిలోని బండరాళ్లు, మట్టిని తొలగించారు. ఈ తవ్వకాల్లో ఎలాంటి నిధులు, బావి వంటివి లభ్యం కాలేదని గ్రామస్తులు తెలిపారు. దీంతో గర్భగుడిలో పురాతన బావి, నిధులు ఉన్నాయన్న వదంతులకు తెరపడింది.

ఈ ఆలయానికి 849 ఏళ్ల చరిత్ర ఉంది. కాకతీయ రాజు మొదటి ప్రతాపరుద్రుడి కాలంలో క్రీ.శ. 1177 జనవరి 9న రథసప్తమి రోజున అప్పట్లో ఇక్కడ పాలించిన బొప్పాయ రెడ్డి, మరీశ్వర దేవరకు, సమీపంలోని గోపినాథ దేవరకు ధూపదీప నైవేద్యాల కోసం భూదానం చేసి ఆలయాన్ని నిర్మించినట్లు అక్కడి శాసనంపై రెండు వైపులా లిఖించిన వివరాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆలయాన్ని ఇప్పటికే పలుమార్లు చరిత్రకారులు, పురావస్తు అధికారులు, చరిత్ర ఔత్సాహికులు పరిశీలించారు. అతి త్వరలో ఆలయ పునర్నిర్మాణ పనులకు కార్యాచరణ చేపట్టనున్నారు.

విమానయాన నిర్వహణ-మరమ్మతు-నిశిత తనిఖీ (ఎంఆర్ఓ)పై సింగపూర్‌తో అవగాహన ఒప్పందానికి మంత్రిమండలి ఆమోదం

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఇవాళ విమానయాన నిర్వహణ-మరమ్మతు-నిశిత తనిఖీ (ఎంఆర్ఓ) రంగంపై సింగపూర్‌తో అవగాహన ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం కింద రెండు దేశాల మధ్య ఈ రంగంలో 'నైపుణ్యాభివృద్ధి సహా పరిశ్రమ అభివృద్ధిలో సహకారం' మరింత విస్తృతమవుతుంది.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ఈ నిర్ణయంపై హర్షం ప్రకటించారు. ఈ మేరకు "భారత్-సింగపూర్ మధ్య ఈ అవగాహన ఒప్పందం ఎంతో ప్రభావశీలమైనదేగాక గౌరవనీయ ప్రధానమంత్రి స్వయంసమృద్ధ భారత్ దృక్కోణానికి అనువైనది" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ల్యాండింగ్ గేర్, రాడోమ్, ఇంజన్లు, కాక్‌పిట్ డిస్‌ప్లే, సీట్లు, రెక్కలు, అత్యంత సూక్ష్మ పరికరాలు సహా విమానంలోని ప్రతి విడిభాగానికీ దేశీయంగానే మరమ్మతు సాగాలన్నది మా ఆకాంక్ష. అలాగే, భారత్‌ను ప్రాంతీయ విమానయాన వర్క్‌షాప్‌గా నిలపడం కూడా ఈ అవగాహన ఒప్పందం లక్ష్యం" అని ఆయన చెప్పారు.

భారత్-సింగపూర్ భాగస్వామ్య సామర్థ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- "సింగపూర్‌లో విమానయాన 'ఎంఆర్ఓ' వ్యవస్థ సుస్థిరంగా ఉంది. మరోవైపు శరవేగంగా పురోగమిస్తున్న విమానయాన మార్కెట్లలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. మన విమానాల సముదాయం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రాంతీయ విమానయాన కూడలిగా మన దేశం వ్యూహాత్మక భౌగోళిక స్థానంలో ఉంది. దీంతోపాటు వాణిజ్య సౌలభ్యం మెరుగుదలకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అందువల్ల ఎంఆర్ఓ రంగం ప్రగతికి భారత్‌లో అవకాశాలు గణనీయంగా ఉంటాయి" అని వివరించారు. విజ్ఞాన ఆదానప్రదానం, పారిశ్రామిక అనుభవం ద్వారా భారతీయ శిక్షణ సంస్థలు తమ పాఠ్యప్రణాళికను, శిక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ప్రతిపాదిత ఒప్పందం వీలు కల్పిస్తుంది. ఇందులో పరిశ్రమల భాగస్వామ్యం పెంపు ద్వారా దేశీయ 'ఎంఆర్ఓ' మౌలిక సదుపాయాల అభివృద్ధికి వీలు కలుగుతుంది. అంతేకాకుండా కాలక్రమంలో విదేశీ నిర్వహణ సేవలపై భారత్ పరాధీనత తగ్గుతుందని అంచనా.ఈ అవగాహన ఒప్పందంతో రెండు దేశాల మధ్య విజ్ఞానం, నైపుణ్యం, ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానానికి సౌలభ్యం కల్పించే చట్రాన్ని ఏర్పరుస్తుంది.ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్ (ఏఎంఈ) శిక్షణ కోసం పరిశ్రమల అవసరాలకు తగినట్లు పాఠ్యప్రణాళికకు సంయుక్త రూపకల్పన.

బాల్యవివాహాల నిర్మూలనకు వందరోజుల ప్రచారం



కామారెడ్డి, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిఆ:బాల్య వివాహాల నిర్మూలనకు 100 రోజుల ప్రత్యేక ప్రచారం వాల్ పోస్టర్ ఆవిష్కరణబాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.పోస్టర్ ఆవిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు బాలల హక్కులకు భంగం కలిగించడమే కాకుండా వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు.

పిల్లల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఆపదలో ఉన్న పిల్లలకు సహాయం అందించేందుకు ఈ టోల్ ఫ్రీ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని, ప్రతి బిడ్డకు సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గిరి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేష్, కార్యాలయ సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్రవంతి, సాధన స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ గిరిజ, ఆూఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.బాల్య వివాహాలను అరికడదాం బాలల హక్కులను కాపాడుదాం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పిద్దాం ప్రతి బిడ్డకు సురక్షితమైన బాల్యాన్ని అందిద్దాం.

మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు

50 మంది రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ

కలుపు యాజమాన్యం, పురుగు తెగుళ్ల నివారణపై అవగాహన

నల్గొండ, నవంబర్ 26: రైతులు మొక్కజొన్న సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్‌మోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్‌లోని మొక్కజొన్న పరిశోధనా విభాగం, అఖిల భారత సమన్వయ మొక్కజొన్న అభివృద్ధి ప్రాజెక్టు సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డీహెచ్ఎం-121 హైబ్రిడ్ మొక్కజొన్న సాగు, కలుపు యాజమాన్యం, సమగ్ర పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 50 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 8 కిలోల చొప్పున బీహెచ్ఎం-121 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా పలతు సందర్భంగా డాక్టర్ కె. మదన్‌మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయి ప్రదర్శనల ద్వారా రైతులకు చేరవేస్తున్నట్లు తెలిపారు. రైతులు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించడం ద్వారా ఉత్పాదకతతో పాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న పరిశోధనా విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రావణి, డాక్టర్ అనూష, వ్యవసాయ సహ సంచాలకులు రమేష్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సన్నీ, రమణ, సందీప్, దీపక్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛత, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో విశేష విజయాలతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6ను ముగించిన డీపీఐఐటీ

న్యూఢిల్లీ, నవంబర్ 26:పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ), దాని అనుబంధ, సబార్డినేట్ కార్యాలయాలతో కలిసి, పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) మార్గదర్శకత్వంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6ను విజయవంతంగా ముగించింది. స్వచ్ఛతా నూత్రాలను సంస్థాగత పరచటం, అధికారిక పనుల్లో పెండింగ్‌ను తగ్గించటం లక్ష్యంగా అన్ని కార్యాలయాల్లో పరిశుభ్రత, సామర్థ్యం, సమర్థవంతమైన రికార్డుల నిర్వహణను ప్రోత్సహించేందుకు ఈ ప్రచారాన్ని చేపట్టారు.

సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 30, 2026 వరకు జరిగిన సన్నాహాల అనంతరం అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31, 2026 వరకు ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6ను నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన, క్రమపద్ధతిలో రికార్డుల నిర్వహణ, సకాలంలో పెండింగ్ కేసుల పరిష్కారాన్ని ప్రోత్సహించేందుకు డీపీఐఐటీ ప్రత్యేకంగా కృషి చేసింది. గుర్తించిన లక్ష్యాలను దాదాపు పూర్తి స్థాయిలో సాధించటం, వివిధ ప్రచార ప్రమాణాల్లో గణనీయమైన పురోగతితో, స్వచ్ఛతను సంస్థాగత పరచటం, సమర్థత, ప్రతిస్పందనను పెంపొందించటం, ప్రభుత్వ పనితీరులో సుస్థిర పద్ధతులను బలోపేతం చేయటం పట్ల డీపీఐఐటీ నిబద్ధతను స్పష్టం చేసింది.

ఈ ప్రచారంలో భాగంగా హర్యానాలోని బల్లభ్‌గఢ్ క్యాంపస్‌లో డీపీఐఐటీ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ (ఎన్‌సీసీబీఎం) బయోమాస్ గ్యాసిఫైయర్‌ను ఏర్పాటు చేసింది. బయోమాస్, కలప, వ్యర్థాల నుంచి తయారయ్యే ఇంధనాన్ని ముడి పదార్థాలుగా ఉపయోగించి ఈ గ్యాసిఫైయర్ మండే స్వభావం గల సిన్‌గ్యాస్ వాయువును ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రచార సమయంలో 150 కిలోల ఎండిన ఉద్యానవన వ్యర్థాలను ఉపయోగించి ప్రయోగాత్మక పరీక్షను ఎన్‌సీసీబీఎం విజయవంతంగా నిర్వహించింది



స్త్రీ చైతన్యం...ఓల్గా రచనల లక్ష్యం

పోపూరి లలిత కుమారి. ఈ పేరు చాలా మంది సాహిత్యా భిమానులకు అపరిచితం. కానీ ఓల్గా అంటే– తెలియని సాహితీ ప్రియులు లేరు. తెలుగునాట ఆమె పరిచయ అవసరం అసలే లేని అభ్యుదయ రచయిత్రి. ఓల్గా అంటే వేయి పోల్చుల ఒక అక్షర ప్రవాహం. ఆమె రచనలు కణకణ మండే నిప్పు కణికలు. ఆమె ప్రసంగాలు భగభగ మండే నినాదాలు. ఓల్గా అసలు సిసలైన స్త్రీ వాది. ఆమెకు స్త్రీవాదమే సందర్భం. స్త్రీవాదమే ఉద్యమం. స్త్రీవాదమే సాహత్యం. స్త్రీవాదమే నేపథ్యం. స్త్రీవాదం సాహిత్యం లోనూ, సమాజంలోనూ బలంగా నాటుకు పోవాలన్నదే ఆమె సంకల్పం. బలమైన ఉద్యమాలను నిర్మించుకుంటూ వెళ్తే తప్ప ఆకాశంలో సగం అవకాశంలో సగం లాంటి పదాలకు న్యాయం చేకూరదని ఆమె నమ్మారు. అందుకు ఆమె సాహిత్యాన్ని ఎంచుకున్నారు. ఆమె పెరిగిన నేపథ్యం, చుట్టూ ఉన్న సాన్ని హిత్యం, చదువుకున్న సాహిత్యం– అన్నీ కలగలిపి అభ్యుదయ భావాలకు ఊపిరి లూదాయి. గోర్కీలాంటి అనువాద పుస్తకాలు. పదో ఏటనే శ్రీశ్రీ మహాప్రస్థానం ఆమెపై ఎంతో ప్రభావం చూపాయి. తర్వాత చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనల వల్ల ప్రభావితమై, స్త్రీ చైతన్యము అంశముగా రచనలు చేసి, తనకై ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఓల్గాగా సుపరిచితులైన "పోపూరి లలిత కుమారి"కి ప్రత్యేక స్థానం ఉంది. రాజకీయ, సాహిత్య రంగపు చర్చలో స్త్రీవాద ధృక్పథాన్ని ప్రవేశ పెట్టిన తెలుగు రచయిత్రిగా ఆమె గుర్తింపు పొందారు. ప్రగతిశీల రచయిత్రిగా... ఓల్గా కథలు, నవలలు, పద్యాలు స్త్రీ సాహిత్య ములో ఎన్నదగినవి. పత్రికలలో, సాహిత్యములో, అనువాద ములలో మహిళా హక్కులపై విస్తృత చర్చలకు ఆమె తెర లేపారు. స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఓల్గా, తనను తాను తెలుగులో గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కంతో ప్రారంభమైన అభ్యుదయ రచనా పరంపరలో భాగంగా కూడా భావించారు.

నవంబర్ 27, 1950న గుంటూరు జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి గ్రామములో పోపూరి వెంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు ఆమె జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు సాహిత్యంలో స్నాతకో త్తర విద్య (ఎం.ఎ) పూర్తి చేసిన తర్వాత తెనాలిలోని వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యాపకు రాలిగా పనిచేశారు. చలన చిత్ర రంగములో 'ఉషా కిరణ్' సంస్థకు కథా రచయిత్రిగా పనిచేసి మూడు చిత్రాలు నిర్మించి పురస్కారాలు పొందారు. ఆమె రాసిన "స్వేచ్ఛ" నవలను వివిధ భారతీయ భాషల్లోకి అనువదించ డానికి నేషనల్ బుక్ ట్రస్టు స్వీకరించింది.1986 నుండి 1995 వరకు ఆమె ఉషా కిరణ్ మూవీస్ లో సీనియర్ కార్యవర్గ సభ్యురాలిగా పని చేసారు. 1991 నుండి 1997 వరకు అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ కు అధ్యక్షురాలిగా పని చేసారు. అమెరికన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ వారు ఓల్గా వ్రాసిన 12

నవంబర్ 27...ఓల్గా జన్మదిన సందర్భంగా



రచనలను, ఆమె కథల ఆంగ్లానువాదములను తమ సంగ్రహములో చేర్చారు.

రాజకీయ కథలు –1993, స్వేచ్ఛ – 1994, సహజ – 1995, ప్రయోగం – 1995, మానవి – 1998, కన్నీటి కెరటాల వెన్నెల – 1999, గులాబీలు – 2000, అకాశంలో సగం (ఉత్తమ నవల పురస్కారం), పలికించకు మౌన మృదంగాలు, అలజడి మాజీవితం, జీవితం, కన్నీటి కెరటాల వెన్నెల, అక్షర యుద్ధాలు – 2009, అతడు – ఆమె మనం – 2005, నవలా మాలతీయం – 2006, సరిహద్దులు లేని సంధ్యలు తదితరాలు ఆమె ప్రముఖ రచనలు.

"స్వేచ్ఛ" నవలకు 1987 – ఉషోదయ పబ్లికేషన్స్ వారి ఉత్తమ నవల రచయిత అవార్డు, 1990 – ఉదయం మాగజిన్ వారు 'తోడు' అనే కథకు ఉత్తమ నవల రచయిత అవార్డు, 1998 – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నంది అవార్డు ఉత్తమ కథ రచయిత, 1999 – తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ స్త్రీ రచయిత అవార్డు, 2014 – లోక్ నాయక్ ఫౌండేషన్ సాహితీ పురస్కారానికి ఓల్గా ఎంపిక య్యారు. 2015 – ఆమె వ్రాసిన "విముక్త" కథల సంపుటి ద్వారా ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైనారు. ఈ సంకలనాన్ని డాక్టర్ కె.రామ చంద్రమూర్తి, డాక్టర్ ఎ.మంజులత, డాక్టర్ జి.యోహాన్ బాబుల జ్యూరీ బృందం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ కథల గురించి ఓల్గా... వర్తమాన సమాజంలో స్త్రీల వేదనలకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా. ఇవాల్టి సమాజంలో అనేక అంక్షలకూ అవమానలకూ హింసలకూ గురై వాటినధిగమించి

లేస్తున్న స్త్రీలు కొందరైతే, వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక, నానా యాతనలు పడుతున్న స్త్రీలెందరో – తమను హింసించే భర్తల నుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తునే, అసహ్యించు కుంటునే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు – ద్వేషంతో

తమను తాము హింసించుకోడం అలవాటైన స్త్రీలు – ఆ స్త్రీల కోసం ఈ కథలు అని పేర్కొన్నారు. స్వేచ్ఛ ఎవరో ఇచ్చేది కాదు. ఎవరినుండి సాధించుకునేది కాదు. మన అవసరాలను, మన ఉనికికి అత్యవసర విషయాలను మనం గుర్తించడమే స్వేచ్ఛ.

నిజానికి అది సాధించడం చాలా కష్టం" అంటారు స్వేచ్ఛ నవల రాసిన సందర్భంలో. స్త్రీ ఎదుర్కొనే ప్రతి సమస్య గురించీ ఆమె ఒకో కథలో కనిపి స్తుంది. ప్రత్యేకత దాని ప్రయోజ కత్వం.

తాను సాహిత్యానికి ఓ ప్రయాజనం ఉండాలన్న ఆశయం తోనే రచనలు మొదలు పెట్టానని చెబుతారు ఓల్గా. ప్రతి కథలోనూ తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. అందుకనే ఆమె కథలో ఓ సూటిదనం కనిపిస్తుంది.

అందులో ఒకోసారి సుదీర్ఘమైన చర్చలూ వినిపి స్తాయి. చివరికి ఓ పరిష్కారమూ ఉంటుంది. ఇలా స్త్రీ విముక్తి కోసం ఆమెకు ఉన్న మొక్క వోని దృఢ సంకల్పం ఆమె ప్రతి కథలోనూ కనిపిస్తుంది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

వీబీజీ రామ్ పనులపై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఆదిలాబాద్, నవంబర్ 26: నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలంలోని రేవోజీపేట, మున్యాల గ్రామాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వరరావు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న వీబీజీ రామ్ పనులను పరిశీలించి, వాటి పురోగతిపై ఏపీఓ రవిప్రసాద్‌ను అడిగి తెలుసు కున్నారు. పనులను పూర్తి స్థాయిలో నిర్వహించడంలో అలసత్వం చూపించవద్దని అధికారులను హెచ్చరించారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను సంబంధిత సర్పంచులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం రేవోజీపేట, మున్యాల గ్రామ పంచాయతీల్లో అమలవుతున్న ఇందిరమ్మ బీమా పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

అనంతరం రేవోజీపేట గ్రామ పంచాయతీలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ నాగవర్ధన్, ఎంపీడీఓ సయ్యద్ జవెద్ అలీ, ఎంపీవో రమేష్‌రెడ్డి, సర్పంచులు లలిత రాజేష్, మహేష్, ఉప సర్పంచులు లావణ్య మొగిలి, కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు శేఖర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 76.6 శాతం పోలింగ్

మధ్యాహ్నం ఒంటిగంటకే 2.51 లక్షల మంది ఓటు హక్కు వినియోగం

వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్ సిరి



అమరావతి, నవంబర్ 26: జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జోరుగా సాగుతోంది. ఎనిమిది మండలాల పరిధిలోని 135 గ్రామ పంచాయతీలకు గురువారం నిర్వహించిన పోలింగ్‌లో మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 76.6 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 3,27,791 మంది ఓటర్లకుగాను 2,51,077 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటలకు 29.7 శాతం, 11 గంటలకు 58.6 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం ఒంటిగంటకు 76.6 శాతానికి చేరింది.

మండలాల వారీగా పరిశీలిస్తే చిప్పగిరిలో అత్యధికంగా 79.8 శాతం, దేవనకొండలో 79.3 శాతం, ఆస్పరిలో 77.7 శాతం, ఆదోని–2లో 77.4 శాతం, ఆదోని–1లో 75.7 శాతం, ఆలూరులో 75.6 శాతం, హాలహర్విలో 73.3 శాతం, హ్వళగుందలో 73.1 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1,303 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.

జిల్లాలో జరుగుతున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఏ. సిరి కలెక్టరేట్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణను పర్యవేక్షించారు.

ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

అహోబిలంలో పోలీసుల తీరుపై ఎమ్మెల్యే అఖిలప్రియ ఆగ్రహం

నారా లోకేశ్‌కు ఫిర్యాదు..

ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయలేదని ఆరోపణ

అమరావతి, నవంబర్ 26: నంద్యాల జిల్లాలో గ్రామపంచాయతీ సర్పంచుల ఎన్నికల మొదటి విడత పోలింగ్ సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అహోబిలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందన్న ఆరోపణలతో అహోబిలానికి చేరుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కారుపై దాడి జరిగినట్లు ఆమె ఆరోపించారు. సమస్యాత్మక గ్రామంగా తెలిసినప్పటికీ పోలీసులు ముందస్తుగా ఎలాంటి బందోబస్తు ఏర్పాటు చేయలేదని, వైసీపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విధులు నిర్వహించిన పోలీసులను ఇక్కడ ఎన్నికల విధులకు నియమించడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు.

తాను అహోబిలానికి వస్తున్నట్లు వైసీపీ నేతలు ముందుగానే తెలుసుకుని గ్రామ శివార్లలో రాళ్లు, కారం పొడి, కర్రలతో దాడులకు యత్నించారని అఖిలప్రియ ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా, తనను అరెస్టు చేస్తామని ఆయన అన్నారని పేర్కొంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలోనే రాళ్ల దాడులకు దిగడం, కార్ల అద్దాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరును నిరసిస్తూ ఎమ్మెల్యే అఖిలప్రియ నిరసన చేపట్టారు. ఈ విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని, నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్తానని తెలిపారు.

పదో తరగతి మండల టాపర్లకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రోత్సాహక చెక్కులు

33 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున అందజేత

నల్గొండ, నవంబర్ 26: విద్యా ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిషన్ 10బిష్ట క్లాస్ ? చదువుకో తెలంగాణ 2025?26' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో 33 మంది పదో తరగతి మండల టాపర్లకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అడిషనల్ కలెక్టర్ అన్నారు.

అనంతరం 2026?27 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'మిషన్ 10బిష్ట క్లాస్ ? చదువుకో తెలంగాణ' పోస్టర్‌ను అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఈవో సుశిందర్ రావు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ డీజీఎం పి. నరేందర్, డీఎం పి. రాజిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ ఎన్. భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బృందం సభ్యులు పి. నరేందర్, పి. రాజిరెడ్డి, ఎన్. భాస్కర్, వి. వెంకటేశ్వర్లు, నర్సింహ, కవిత, రవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ అసిస్టెంట్ కంట్రోలర్‌గా డాక్టర్ దోమల రమేశ్



నల్గొండ, నవంబర్ 26:మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) పరీక్షల విభాగం అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా వర్సిటీ రసాయన శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దోమల రమేశ్ నియమితులయ్యారు.

ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొ.కొప్పుల అంజిరెడ్డి నియామక ఉత్తర్వులను వీసీతో కలిసి గురువారం అందజేశారు.

డాక్టర్ దోమల రమేశ్ గతంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా, హాస్టల్స్, వర్సిటీ కాంపిటేటివ్ సెల్ డైరెక్టర్‌గా, సైన్స్ కళాశాల రసాయన శాస్త్రం హెచ్‌వోడీగా బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం పరీక్షల విభాగం అసిస్టెంట్ కంట్రోలర్‌గా ఏడాది పాటు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఈఎల్‌వీ భాస్కర్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ

హక్కుల కోసం ఓబిసిలంతా ఏకం కావాలి

ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ పిలుపు



నల్గొండ, నవంబర్ 26: తమ హక్కుల కోసం ఓబిసిలంతా ఏకం కావాలని ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ?చలో రామ్‌లీలా మైదాన్ పేరిట ఓబీసీ హక్కుల కోసం ఈ నెల 28న ఢిల్లీలో మహాధర్న నిర్వహించనున్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి మద్దతుగా ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ఫౌండేషన్ సభ్యులు, ఓబీసీ కార్యకర్తలు, యువత, మహిళలు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ఓబీసీ సంఘాల ప్రతినిధులు రైల్లో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 2027లో నిర్వహించనున్న కుల గణనలో ఓబీసీలను పూర్తిగా లెక్కించాలని, వారికి సరైన రాజకీయ, విద్యా, ఉపాధి, సంక్షేమ హక్కులు కల్పించాలని కోరుతూ ఈ ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. ఓబీసీ వర్గాల హక్కుల సాధనకు దేశ వ్యాప్తంగా ఉన్నవారంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జన గణనలో అన్ని కులాలకు ప్రత్యేక డ్రాప్‌డౌన్ ఆప్షన్ అమలు చేయాలన్నారు. కుల గణనలో ఓబీసీలను పూర్తిగా గుర్తించి లెక్కించాలన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని సమీక్షించాలని, సీలింగ్ తొలగించే అవకాశం పరిశీలించాలని కోరారు. ఓబీసీల రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉపాధి అవకాశాలను పెంచాలని పేర్కొన్నారు.

అరవై ఒకటో వెనిస్ ఆర్ట్ బియనాలేలో ఉత్తమ జాతీయ భాగస్వామ్యానికి ఇచ్చే 'విజిటర్స్ లయన్' పురస్కారం భారత్ కైవసం

న్యూఢిల్లీ, నవంబర్ 26:'వెనిస్ బియనాలే' (బియనాలే ఆర్టే– 2026)లో భాగంగా ఏర్పాటు చేసిన 61వ అంతర్జాతీయ కళా ప్రదర్శనలో అత్యుత్తమ దేశ భాగస్వామ్యానికి ఇచ్చే "విజిటర్స్ లయన్" పురస్కారాన్ని (విజిటర్స్ లయన్ ఫర్ బెస్ట్ నేషనల్ పార్టిసిపేషన్) భారతదేశం చేజిక్కించుకుంది. కళాప్రపంచంలో ఒలింపిక్స్ గా వెనిస్ బియనాలే ప్రసిద్ధిని పొందింది. లా బియనాలే డి వెనిజియా లో ప్రజల ఓట్ల ఆధారంగా విజిటర్స్ లయన్స్ పురస్కార విజేతలను ఇవాళ ప్రకటించారు.

ఈ ఫలితంపై లా బియనాలే డి వెనిజియా అధ్యక్షుడు శ్రీ పియెత్రాంగెలొ బుట్టఫూకొ మాట్లాడుతూ, సందర్శకులు 'విజిటర్స్ అవార్డు'ను అందించి 'ఒక పెయింటింగు.. దానిని ఎవరైనా చూసినప్పుడు మాత్రమే జీవం పోసుకుంటుంది' అని పాబ్లో పికాసో చెప్పిన మాటలను నిజం చేశారన్నారు.

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్ స్పందిస్తూ, ఇది దేశ ప్రజలు ఎంతో సంతోషించే క్షణమన్నారు. "ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతీయ కళాకారుల్లో కొత్త తరం కళాకారులకే కాక భారత సాధికార సమకాలీన కళా రంగానికి కూడా ఒక ప్రమాణంగా నిలుస్తుంది. ఇది భారత చిరకాలిక కళాత్మక సంప్రదాయాలను సమకాలిక అభివ్యక్తుల్లోకి ఎంత ప్రభావవంతంగా బదలాయించవచ్చో, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల మనసులను ఎలా ఆకట్టుకోవచ్చో తెలియజేసే సందర్భం.

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి : ఎస్పీ అశోక్ కుమార్

కరీంనగర్, నవంబర్ 26:కేసుల దర్యాప్తు లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. గురువారం బుగ్గారం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు . పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సీడీ ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సీడీ ఫైళ్లను పరిశీలించారు.కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామనీలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.